7 జనవరి, 2024
ఆదివారం
వార్త



# నేర మత్తులో యువత చిత్తు



# 'గీతాంజలి' సీక్వెల్

అంజలి ప్రధానమైన పాత్రను పోషించిన 'గీతాంజలి' సినిమా 2014లో విడుదలైంది. ఎంవీవీ సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమాకి రాజ్‌కిరణ్ దర్శకత్వం వహించాడు. కోన వెంకట్ స్క్రీన్ ప్లే అందించిన ఈ సినిమా హారర్ కామెడీ జోనర్లో ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' రూపొందుతోంది. కోన-జేవీ-ఎంవీవీ సత్యనారాయణ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అంజలికి 50వ సినిమా కావడం విశేషం. తాను ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమాలలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమా ఇదే కావడం మరో ప్రత్యేకత. ఈ సినిమాతో దర్శకుడిగా శివ తుర్లపాటి పరిచయమవుతున్నాడు.

తారాతీరం

# జనవరి 13న 'సైంధవ్' విడుదల!

విక్టరీ వెంకటేష్ హీరోగా యువ దర్శకుడు శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా పాన్ ఇండియన్ చిత్రం 'సైంధవ్'. ఈ చిత్రంలో శ్రద్ధాశ్రీనాథ్ కథానాయిక కథానాయికగా నటిస్తుండగా నిహారికా ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయినపల్లి నిర్మిస్తున్నారు.

నవాజుద్దీన్ సిద్దిఖీ విలన్‌గా నటిస్తున్న ఈ మూవీలో ఆర్య, ఆండ్రియా, రుహాణి శర్మ, ముఖేష్ రుషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.



ఆదివారం వార్త
7 జనవరి, 2024

## మంచి ముత్యాలు

ప్రకృతి ఒకవిధంగాను, విజ్ఞానం మరొక విధంగాను ఎప్పుడూ, ఏనాడూ పొరపాటున కూడా చెప్పవు.

- ఎడ్మండ్ బర్క్

## విషయ విశేషం

పట్టుదలతో ఎగసిన కెరటాలు... 4
'సంఘీ'భావం....5
ఓట్ల కోసం ఖజానా ఖాళీ
కవర్ స్టోరీ..6
నేర మత్తులో యువత చిత్తు
ఆధునిక జీవనశైలి...11
ఈవారం కవిత్వం..12
బాల చంద్రిక
ఆధునిక పెళ్లికూతురు...14
కొత్త ఆశయాలతో....18
కథ.. 20
తద్దినం
సాహిత్యం..23
'కవిభూషణ' ఆచార్య దివాకర్ల వేంకటావధాని
అందాల ద్వీపం-అద్భుత పర్వతాలు...25
రైస్‌మిల్లు కొనవచ్చా?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### వెన్నునొప్పికి కారణాలు

ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది దీర్ఘకాలిక దిగువ వెన్నునొప్పితో బాధపడుతున్నారు. దీనికి సరైన చికిత్స లేకపోవడంతో పెద్దవాళ్లలో 40శాతం ఈ నొప్పితో తీవ్రంగా సతమతమవుతున్నారు. అందుకే లాస్‌ఏంజలిస్‌లోని సెడార్స్-సినాయ్ ఆసుపత్రికి చెందిన నిపుణులు ఈ విషయమై సమగ్రంగా అధ్యయనం చేయగా వెన్నుపూస డిస్కుల్లో ఉండే జెల్లీ లాంటి పదార్థంలో కొత్త ఉపకణాలు ఉన్నట్లు తెలిపింది. వీటివల్లే బాధ ఎక్కువగా ఉందని వాళ్ల పరిశీలనలో స్పష్టమైంది. ఎందుకంటే వెన్నుపూస ఆరోగ్యంగానూ లేదా డిస్కులు అరిగిపోయిన వాళ్లలోనూ ఈ ఉపకణాలు లేకుంటే ఎలాంటి నొప్పి రావడం లేదట. దాంతో నొప్పికి కారణమైన నిర్దిష్టకణాల్ని తొలిసారిగా గుర్తించగలిగామనీ, ఈ కణాల పనితీరును తెలుసుకోవడం ద్వారా చికిత్సను కనుగొనడం సులభమవుతుందనీ పరిశోధకులు చెబుతున్నారు. ఈ అధ్యయనంలో భాగంగా ఈ కణాల్ని పోలిన కృత్రిమ కణాలను రూపొందించి, వాటికి చేరువలోనే నొప్పి సంకేతాలను పంపించే నూరాన్లను ఉంచినప్పుడు అవి స్పందించాయట. అదే ఆరోగ్యంగా ఉన్న కణాలను ఉంచినప్పుడు నూరాన్ల నిర్మాణంలో ఎలాంటి మార్పూ కనిపించలేదు.కొత్త కణాలకు చికిత్స చేయడం ద్వారా నొప్పిని తగ్గించవచ్చు అంటోంది పరిశోధక బృందం.

### జోక్స్..జోక్స్...

**సుబ్బారావు:** ఏం, అప్పారావు అలా అయిపోయావు?
**అప్పారావు:** ఏం చేయను? బస్సు ఫ్రీ అయిన తర్వాత మా ఆవిడ షాపింగ్ ఎక్కువైంది, నేను ఆవిడ చేయ్యవలసిన పనులన్నీ నేను చేస్తున్నాను..

...

**యజమాని:** ఈ సర్ఫ్ ప్యాకెట్ ఇక్కడ ఉందేంటి?
**వంటవాడు:** నేను ఎప్పుడు ఇడ్లీలు చేసినా కూడా తెల్లగా లేవు అంటుంటారు కదా..అందుకే సర్ఫ్ తెచ్చాను.
**యజమాని:** సర్ఫ్ తెచ్చి ఏం చేసావు?
**వంటవాడు:** ఇడ్లీ పిండిలో కలిపానండి. వారం నుండి మీరు వాటినే తింటున్నారు.
కళ్లు తిరిగి పడిపోవడం యజమాని వంతయ్యింది..

- ఎస్.కె.యాకుబ్‌పాషా, ఖమ్మం

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



కపాడియా

**ఎదగాలనే** పట్టుదల, అందుకు తగినట్టుగా శ్రమపడితే తప్పని సరిగా అనుకున్న గమ్యానికి చేరుకోగలం. కూలీ పనులు చేసి, కోటీశ్వరులు అయినవారెందరో ఉన్నారు. రోడ్డుపక్కన టిఫిన్ సెంటర్లు నడిపిన వారు స్టార్‌హోటళ్లకు యజమానులుగా మారిన స్ఫూర్తిదాతలు మనకు తెలుసు. వనరులు, సదుపాయాలు లేకపోయినా, పట్టుదలతో వాటిని సమకూర్చుకుని, అనుకున్న లక్ష్యసాధనకు చేరిన వారిగురించి మనం వింటూనే ఉన్నాం. చిరు ఉద్యోగంతో కెరీర్ ఆరంభించి, దేశం అత్యున్నత పదవులను పొందిన వారున్నారు. ఇలాంటి అరుదైన వారిలో కపాడియా ఒకరు. వీరి పూర్తి పేరు ఎస్.హెచ్.కపాడియా. 1947, సెప్టెంబరు 29వ తేదీన ముంబయిలో జన్మించిన కపాడియా దేశ అత్యున్నత పదవుల్లో ఒకటైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. కపాడియా నాల్గవ తరగతి ఉద్యోగిగా తన కెరీర్ జీవితాన్ని ఆరంభించారు. అనంతరం ముంబయి 'లా' ఆఫీసులో క్లర్క్‌గా పనిచేశారు. ఒకవైపు పనిచేస్తూనే, మరోపక్క లా కోర్సును పూర్తి చేశారు. ఆసియాలోనే అత్యంత పురాతనమైన లా కాలేజీగా ప్రసిద్ధి చెందిన ముంబయి ప్రభుత్వ లా కళాశాల నుంచి కపాడియా లా డిగ్రీని పొందారు. 'ఫైర్‌బ్రాండ్'గా పేరొందిన ఫిరోజ్ దామన్య వద్ద కొంతకాలం పనిచేశారు. తర్వాత 1974, సెప్టెంబరు 10వ తేదీన ముంబయి హైకోర్టులో న్యాయవాది గా పదోన్నతిపొందారు. తదనంతరం 1991 అక్టోబరు 8వ తేదీ నుంచి 1993 మార్చి 23 వరకు శాశ్వత అడిషనల్ జడ్జిగా నియమించబడ్డారు. అనతికాలంలోనే అనగా 2003, ఆగస్టు 5 తేదీన ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గా పనిచేశారు. ఇంతటితో కపాడియా కెరీర్ వృద్ధి ఆగిపోలేదు కాని, సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2010 మే 12వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితు లయ్యారు. అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ కపాడియా చేత ప్రధాన న్యాయమూర్తిగా పదవిని స్వీకరించి, 2012, సెప్టెంబరు 29వ తేదీన పదవీ విరమణ చేశారు.
కపాడియాకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కపాడియా 2016, జనవరి 4వ తేదీన ముంబయిలో మరణించారు.

# పట్టుదలతో ఎగసిన కెరటాలు

**ఈరోజు** పెన్షనర్లందరూ పెన్షన్ తీసుకుంటూ వృద్ధాప్యంలో హాయిగా జీవిస్తున్నారంటే డి.ఎస్.నకారాయే కారణం. పూర్తి వివరాల్లోకి వెళ్తే..డి.ఎస్. నకారా ఇండియన్ డిఫెన్స్ సర్వీసులో ఫైనాన్స్ అడ్వైజర్‌గా ఉద్యోగం చేస్తూ.. 1972లో రిటైర్ అయ్యారు. పెన్షన్ సిస్టం బ్రిటిష్ వారు అమలులోకి తెచ్చిన ప్పటికీ కొన్ని కారణాల వలన స్వాతంత్ర్య అనంతరం ఆగిపోయింది. అప్పుడు నకారా 'నేను దేశానికి ఎంతో సేవ చేశాను, కాబట్టి వృద్ధాప్యంలో నేను జీవించడానికి ఆర్థికంగా ప్రభుత్వం తోడ్పాటును అందించాల్సిందేనంటూ' సుప్రీంకోర్టులో కేసు వేశారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చడం జరిగింది. వాదనలు ముగిసిన తర్వాత..అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డిసెంబర్ 17, 1982 సంవత్సంలో పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, ప్రభుత్వం పెట్టే భిక్ష కాదని చారిత్రాత్మకమైన తీర్పును వెలువరించడం జరిగింది.
అందుకే ఈ తీర్పును 'మాగ్నా కార్టా' ఆఫ్ పెన్షనర్స్‌గా చరిత్రకెక్కింది. ఆ మహనీయుడి ఆరోజు చేసిన కృషి ఫలితంగా నేడు విశ్రాంత ఉద్యోగులందరూ సంతోషకరమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. అందుకే కారల్ మార్క్స్ అంటాడు 'పోరాడితే పోయేదిమీ లేదు బానిస సంకెళ్లు తప్ప' అని. అందుకే నకారా చేసిన పోరాటం చరిత్రకెక్కింది. ఒక హీరోగా నిలబెట్టింది. ఈ సందర్భంగా వారిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 17న పెన్షనర్స్ దినోత్సవంగా 1983 నుంచి జరుపుకుంటున్నారు.



నకారా

'సంఘీ' భావం



# ఓట్ల కోసం ఖజానా ఖాళీ

**అభివృద్ధి,** సంక్షేమ పథకాలు లక్ష్యంగా సాగాల్సిన ప్రభుత్వాల పాలన ఓట్ల కోసం ఉచితాలను ప్రవేశపెట్టి ఆర్థిక సంక్షోభాన్ని సృష్టిస్తున్నారు. ఎన్నికల సమయంలో విజయం సాధించేందుకు లెక్కకు మించిన హామీలు ఇచ్చిన పార్టీలు గద్దెనెక్కిన తరువాత వాటి అమలుకు భారీ మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. గతంలో ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు కేవలం ఆయా ప్రాంతాల అభివృద్ధికి, వెనుకబడిన వారి సంక్షేమానికి మాత్రమే ముడిపడి ఉండేవి. ఓటర్లు కూడా తమ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఓట్లు వేసే వారు. అయితే మారిన పరిస్థితుల్లో ఏ పార్టీ తమకు ఏమేరకు ఉచితాలు ఇస్తోందన్న అంశంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఓటర్ల మనోగతానికి అనుగుణంగా పార్టీలు కూడా ఉచితాలు, నగదు బదిలీలు అంటూ తమ ఎన్నికల మ్యానిఫెస్టోను రూపకల్పన చేస్తున్నాయి. ముఖ్యంగా సిద్ధాంతాల స్థానంలో వ్యూహకర్తలు రంగప్రవేశం చేసిన తరువాత ఎన్నికల వ్యవహారశైలిలోనే మార్పు వచ్చింది. దీర్ఘకాలిక ప్రణాళికలను పక్కన పెట్టి కేవలం ఎన్నికల్లో ఎలా విజయం సాధించాలన్న లక్ష్యంతో వ్యూహాలు రూపొందించడంతో సమాజానికి, ప్రభుత్వ ఖజానాకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లుతోంది. ఎదుటిపార్టీ ఉచితాలు ప్రకటించడంతో మరో పార్టీ కూడా అంతకు మించిన ఉచిత పథకాలను ప్రకటించి ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వైఖరి వల్ల ఏమేరకు నష్టం జరుగుతుందో తెలుసుకోవడానికి తెలుగు రాష్ట్రాలు ఉదాహరణగా కనిపిస్తున్నాయి. అనేక పథకాలను రూపకల్పన చేసి ప్రతి వారం పది రోజులకు నగదు బదిలీలకు శ్రీకారం చుడుతున్నారు. వ్యవస్థలను మెరుగుపరచడం కంటే ఆయా వ్యవస్థలతో ప్రమేయం ఉన్న వారికి నేరుగా డబ్బు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. దీని వల్ల దీర్ఘకాలంలో ఆయా వ్యవస్థలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో అప్పులు చేయనిదే రోజు గడవని స్థితి ఉంది. అయినా ఇంకా ఉచితాలు కొనసాగించేందుకే ప్రభుత్వాలు మొగ్గు చూపిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో పథకాల అమలులో ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో ఖజానాలు గుల్ల అయ్యాయి. ప్రజలు కోరుకోని పథకాలను కూడా బలవంతంగా ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడాన్ని పక్కన పెట్టి రైతు భరోసా, రైతు బంధు వంటి పథకాలను అమలుచేస్తున్నారు. మహిళలు అందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాలని ఏ మహిళా కోరుకోలేదు. అయినా తెలంగాణలో ఇప్పటికే అమలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా త్వరలో అమలుచేస్తామని చెబుతున్నారు. మహిళలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే ఈ విధంగా ఉచితాల రూపంలో కాకుండా ఉపాధి కల్పించడమో, లేక అదనపు ఆదాయం కల్పించేందుకు పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, ఇతర ఉపాధి పథకాలను అమలుచేస్తే మహిళల్లో చైతన్యం కలగడమే కాకుండా రాష్ట్రానికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసినా కొన్ని షరతులు, నిబంధలు ఉంటే సమంజసంగా ఉండేది. ఉచిత ప్రయాణం అమలుచేయడానికి ముందే బస్సుల్లో సీట్లు దొరకని పరిస్థితి ఉండేది. చాలా మంది మహిళలు బస్సులో ప్రయాణం చేస్తూ ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాన్ని అదుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ఉచిత సౌకర్యంతో కొందరు అవసరం లేకపోయినా బస్సులు ఎక్కడం ప్రారంభించడంతో ఉపాధి కోసం వెళ్లే మహిళల పరిస్థితి అత్యంత దీనంగా మారింది. దళితబంధు కూడా ఆయాచిత మొత్తాలను ఇచ్చే పథకంగా పరిగణించాల్సి ఉంది. విద్యారంగానికి కూడా ఉచితాల బెడద తప్పడం లేదు. పాఠశాలలను అభివృద్ధి చేసి మెరుగైన విద్యను అందిస్తే నిరుపేదలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల వర్గాలకు చెందిన విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది. దీనికి బదులు వారి వ్యక్తిగత ఖాతాల్లో నగదును జమ చేయడం వల్ల కొత్త సమస్యలు ఎదురౌతున్నాయి. ఉచితాలు, నగదు బదిలీలు వంటి పథకాలను నిలిపివేసి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మేధావులు డిమాండ్ చేస్తున్నారు. ఒక వ్యక్తి తాను పన్నుల రూపంలో చెల్లించే మొత్తాలను వేరొకరికి ఉచితంగా ఇవ్వడమేమిటని పన్ను చెల్లింపుదారులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో కొత్తగా ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని ప్రకటించింది. ప్రస్తుతం ప్రధానంగా పేర్కొన్న ఆరు హామీల అమలు గుదిబండగా మారింది. ఈ పథకాలు అమలుచేయాలంటే కనీసం 70 వేల కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఇక గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఈసారి కొనసాగిస్తారా లేదా అన్న విషయంపై కూడా స్పష్టత లేదు. ఎన్ని ఉచితాలు, నగదు బదిలీలు అమలు చేస్తే ఆమేరకు ఖజానాకు నష్టం వాటిల్లుతూనే ఉంటుంది. కులాలకు సంబంధించిన రిజర్వేషన్లు అమలుచేయడానికి ఒక దశ వరకే అవకాశం ఉంటుంది. 51 శాతం మించి రిజర్వేషన్లు అమలు చేయరాదన్న నిబంధన ఉంది. ఆదాయంలో కూడా ఉచితాలకు, నగదు బదిలీలకు కొంత శాతానికి మించి ఖర్చు చేయకూడదన్న నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పథకాలు అమలు చేయడం అభివృద్ధి కార్యక్రమాలను పక్కన పెట్టడం సర్వసాధారణంగా మారింది. పన్ను చెల్లింపుదారులు తాము కట్టిన పన్నులు సక్రమంగా వినియోగించుకోని ప్రభుత్వా లను ప్రశ్నించే స్థాయికి రావాలి. అప్పుడే ప్రభుత్వాలు తగిన జాగ్రత్తలు తీసుకుంటాయి. స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి ఇలాంటి విషయాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# నేర మత్తులో యువత చిత్తు

కవర్ స్టోరీ

జంధ్యాల శరత్‌బాబు

విచ్చలవిడితనానికి అలవాటుపడిన ఒక యువకుడు కర్కోటకుడిగా మారి ఒకరూ ఇద్దరూ ముగ్గురూ నలుగురూ ఐదుగురూ ఆరుగురూ.. ఏకంగా ఆరుగురిని పొట్టన పెట్టుకున్నాడు. ఒక కుటుంబమంతటినీ నమ్మించి వంచించి, వరసబెట్టి అందరినీ పరమదారుణంగా చంపేశాడు!! ఒక్కొక్కరినీ ఒక్కో చోటకు తీసుకెళ్లి ఆ నిండు ప్రాణాల్ని ఘోరాతిఘోరంగా తీసేశాడు. తాడుతో గొంతు బిగించి, రాళ్లూ కట్టెలతో చావచితక్కొట్టి, శవాల్ని పెట్రోల్ పోసి కాల్చేసి 'సీరియల్ కిల్లర్' అయ్యాడు. శవభాగాల్ని వేర్వేరు చోట్ల పడేసి, తప్పించుకు తిరగాలనుకున్నాడు. కానీ.. పాపం పండి పోలీసు బృందాలకు దొరికిపోయాడు. ఇద్దరు పిల్లలు, ఒక దివ్యాంగురాలితో సహా ఆరుగురి ఉసురూ తీసేసిన ఆ నరరూప రాక్షసుడి వయసు పాతికేళ్లలోపే!!! రాస్తుంటేనే, చదువుతుంటేనే, వింటుంటేనే, చెప్తుంటేనే గుండె ఎడాపెడా అరిపోయే ఈ వరుస పరంపర ఖూనీలేమిటి? ఇన్ని నేరాతినేరాలు దాపురించడమేమిటి? ఎందుకిదంతా? యువత అంటే ఘోర నేరాలమయమా.. పైశాచికత్వానికి పర్యాయపదమా....

ఒక్క తెలుగునాటనే కాదు.. మొత్తం అంతటినీ అత్యంత తీవ్ర భయభ్రాంతం చేస్తోంది యువత నేర ప్రవృత్తి! సామాజిక, ఆర్థిక, వాతావరణమంతటినీ పూర్తిగా కలుషిత సాగరంలో ముంచేసి సమస్త మానవత్వానికీ పెనుసవాలు విసురుతోంది. హింసాత్మక, క్రూర కార్యకలాపాలకు ఆ కరడుగట్టిన నేరగాళ్లు పాల్పడటమే కాకుండా అందరి కళ్లూ కప్పేందుకు నానా రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అదంతా తెలిసి చేస్తున్నదే, చట్టాన్ని పనిగట్టుకుని ధిక్కరించి 'నువ్వా-నేనా' అంటున్న వ్యవహారమే. పాపకృత్యాలకు వారు అంతగా తెగబడుతున్నారంటే నేర పరిశోధక పోలీసు సంస్థతోనే దాగుడుమూతలు ఆడుతున్నారంటే, అసలు సమస్త వ్యవస్థలోనే ఎక్కడో ఏదో లోటూ పాటూ ఉందంటున్నారు. ఒడిశా మాజీ డీజీపీ సంజీవ్.

టీనేజ్‌లోనే నేరాల మోరూ జోరూ పెరగడాన్ని సాంఘిక విపత్తు/ఉపద్రవంగా పరిగణించాల్సిందేనని చాటి చెప్తున్నారు. ఆ రాష్ట్రంలో ఒకచోట ఓ కుర్రాడు పదునైన కత్తితో అమ్మాయిని కసితీరా కసాకసా పొడిచి పారేశాడు. వాడిని వలపన్ని పట్టేసిన పోలీస్ ఉన్నతాధికారులతో ఏమన్నాడో తెలుసా? "నేను చేసిందాంట్లో తప్పేముంది? నాకు ఏం జరుగుతుంది?" అని.

నేరాల్ని సహించాలా? ఏదైనా ముల్లు గుచ్చుకుంటేనే విలవిల్లాడుతాం. మన చేయి పొరపాటున తగిలితేనే 'సారీ సారీ ' అంటాం. అటువంటిది కొంతమంది ఎటువంటి బాధా భయమూ బెరుకూ లేకుండా, ఎత్తుగడలతో మరీ నేరాలూ ఘోరాలకు ఎలా పాల్పడుతున్నారు? పదునైన ఆయుధాలు సంపాదించి, దాచుకుని, నేర సందర్భంలో ఏ విధంగా వాడుతున్నారు? వాళ్లు ఏం చేస్తున్నారో వాళ్లకే అంతుపట్టనంత హింసోన్మాద స్థితి కాదా అది? రెప్పపాటులోనే నేరగాళ్ల ఆటలు కట్టించే పోలీస్ ఆఫీసర్లను హేళన చేయడం అనకూడదా దాన్ని? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు సభ్యసమాజం ముందు నిలుస్తున్నాయిప్పుడు. వీటి పూర్వాపరాలు తెలియాలంటే క్షుణ్ణంగా పరిశీలన జరిగి తీరాలంతే. నేరపూరిత ప్రవర్తనను అరికట్టడానికి ఏవో కొన్ని చర్యలో కొద్దిపాటి ఖండనలో సరిపోవు. ఆ చర్యల్లోని ప్రతీ ఒక్కటీ నేరం గుండెలో గునపం దింపేలా ఉండాలి.



అకృత్యం చేయడానికి, వాడు ఎవడైనా సరే గజగజ వణికిచ్చేలా ఉండితీరాలి. చట్ట నిబంధనలన్నీ విడిగా ఉమ్మడిగానూ మరెంతో పదునుతేరితేనే క్రిమినల్‌కి ఉచ్చు బిగించినట్లవుతుంది. 'నేరకృత్యానికి ఉన్నపళంగా పాల్పడటం, శిక్ష పడిన తర్వాతా ఏ విధమైన పశ్చాత్తాపమూ లేకపోవడం అనేది సర్వసామాజిక వ్యవస్థకీ ఆ పాపాత్ముడు ఛాలెంజ్ విసరడమే కదా' అని వ్యాఖ్యానించారు తమిళనాడు డిటెక్టివ్ ఉన్నతాధికారి షణ్ముగప్రియ.

యువతరం అంటే శక్తి, యుక్తి. ఎంతో యువ సంపన్నత నిండిన దేశం మనది. సద్వినియోగం చేసుకోవాలన్నదే అందరి ఆకాంక్ష. సదుపయోగం కావాలంటే ఆ యువత మానసిక-శారీరక ఆరోగ్య పరిరక్షణ అత్యవసరం. అదంతా కుటుంబం నుంచే ప్రారంభం కావాలన్నది హరియాణా దర్యాప్తు సంస్థ కమిషనర్ శత్రుజిత్‌సింగ్ నిశ్చితాభిప్రాయం.

తల్లిదండ్రులు, గురువుల నుంచే మంచిని నేర్చుకుంటారు పిల్లలు. తప్పు చేయకూడదని, ఆ విధమైన ఆలోచనైనా రాకూడదని వారికి తెలియచెప్పాల్సిన బాధ్యత పూర్తిగా పెద్దలదే. బాధ్యతాయుత పాత్రను మొదట ఇంట్లోనివారు పోషిస్తేనే మంచి ఫలితాలు ఉంటాయంటారు ఆయన. కుర్రాళ్లు గతాన్ని పూడుస్తారు. చరిత్రను మారుస్తారు. కథలై నిలుస్తారు. కళలకు పందిళ్లు వేస్తారు. 'నేటి మొనగాళ్ల చెలిమికి జతగాళ్లూ' అని పలికింది ఒక కవి స్వరం. వాళ్లు చెడుకు పగవాళ్లు కావాలనీ, కళ్లాలు లేనివాళ్లుగా ఎదగాలనీ అభిలషించింది. కన్నవారి కలలు నెరవేర్చేవారు, కుటుంబ బాధ్యతను ఫలప్రదం చేసేవారు, తమదైన వృత్తి ఉద్యోగాలలో చక్కగా రాణించేవారు ఎప్పుడూ ఉంటారు. అలా కాకుండా వ్యసనాల బాట పట్టి, ఇంటా బయటా నేర స్వభావాన్నే ప్రదర్శించే యువజనులే సదా ప్రమాదకారులు. ఆ తత్వాన్ని అరికట్టే మార్గాల కోసమే ఎందరెందరు పెద్దవారో అన్వేషిస్తున్నారు. మంచిని పెంచి, చెడును తుంచాలన్నదే వారి ఆశ, ఆశయం.



### అన్నీ చేదునిజాలే



ఎప్పుడూ ఎక్కడా అన్నీ పంచదార గుళికలే ఉండవు. చేదుమాత్రలూ ఉంటూనే ఉంటాయి. మన దేశంలో క్రైమ్ రేట్ రిపోర్ట్-2023ను పరిశీలిస్తే నేరగణాంకాల నమోదు సంస్థ వివరాలను విశ్లేషిస్తే ఇవీ వాస్తవాలు:

- ఏదోవిధంగా పెద్ద మొత్తాల్ని కొట్టేయాలన్న దురాశ కొంత మందిలో పెరుగుతోంది.
- ఏం చేసినా తమను ఎవరూ ఏమీ చేయలేరన్న దుడుకు పోకడ మితిమీరుతోంది.
- కొందరు యువతీ యువకులు వక్రమార్గాల చుట్టూ తెగ తిరుగుతున్నారు.
- దొంగతనాలు, దోపిడీలను సాహసంగా, చట్ట ధిక్కరణ ధీర కృత్యంగా వ్యవహరించే ప్రబుద్ధులు మరికొంతమంది.. వీళ్లదంతా పెడపోకడ.
- తోటి వ్యక్తుల ప్రోద్బలంతో దోవ తప్పి నేరాల్లో కూరుకుపోయేవాళ్లూ ఎంతో మందిని ఎగదోసి ఆఖరికి పాతాళానికి తోసేస్తున్నాయి.
- మాదక ద్రవ్యాలు, అనైతిక ప్రవర్తనలు, స్వార్థ రాజకీయ నాయకులతో అంటకాగడాలు, మిత్రులమంటూ చుట్టూ తిరిగే వ్యక్తుల ప్రోద్బలాలు, కొన్ని చలన చిత్రాలు, వీడియోలు యువ నేరగాళ్లను తయారు చేస్తున్నాయి. పెంచి పోషిస్తున్నాయి.
- సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ లెక్కల ప్రకారం నిరుద్యోగ తీవ్రత, సావాస దోషం, మరికొన్ని సంఘ వ్యతిరేక శక్తులు నేరాలను పురికొల్పుతున్నాయి.

నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో రికార్డులు అనుసరించి చోరీలు, వ్యక్తుల అపహరణలు, క్షణికోద్రేకంతో హత్యలు సంఖ్యాపరంగా పెచ్చుపెరుగుతున్నాయి. తమకు పడని వ్యక్తులను అడ్డు తొలగించుకోవడమన్నది ఝార్ఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో నిరుడు పెచ్చు పెరిగింది. ఉత్తరప్రదేశ్‌లో వరుసగా రెండేండ్లూ నేర సంఘటనలు ఎక్కువగా పెరిగాయి. తదుపరి స్థానం రాజస్థాన్‌ది. హింసోన్మత్త వైరి, మూకుమ్మడి అఘాయిత్యాలు, అత్యాచారాలు, సైబర్ క్రైమ్‌కు పాల్పడటం యువతరంలో హెచ్చుతోంది. దేశంలో నగరాల వారీగా పరిశీలించినప్పుడు గతేడాది నేరాత్మక సంఘటనల సమాచారం, క్రైమ్ రేట్ లక్షల్లో సగటున 445.9గా ఉంది. అది రాజధానిలో 150.6,

చెన్నైలో 101.6, అహ్మదాబాద్‌లో 96.6. అనంతర స్థానాల్లో ఉన్నవి: సూరత్, పుణె, బెంగళూరు, జైపూరు. ఇదివరకటి గణాంకాల రీత్యా ఇందులో ఆంధ్రప్రదేశ్ 11వ స్థానానికి చేరింది. హత్యలు 982; నిర్లక్ష్య, నేరభరిత డ్రైవింగ్ మూలాన ప్రాణాలు హరించిన సంఘటనలు 7,921; మరెన్నో కేసులు ఒక్క ఏడాదిలోనే నమోదయ్యాయి. తెలంగాణలో ఒక సంవత్సరం 21,795 కేసులైతే మరు సంవత్సరానికి 3 సంఖ్య 24,821కి పెరిగిపోయింది.



హైదరాబాద్ నగరంలో క్రైమ్ రేట్ రెండేళ్ల నడుమ రెండు శాతం పెరిగినట్లు సాక్షాత్తు కొత్త పోలీస్ కమిషనరే వెల్లడించారు. వాటిల్లో స్థిరాస్తి సంబంధిత నేరాలు మూడు శాతం హెచ్చాయన్నారు. ఎక్కువ భాగం యువత పాత్ర ఉన్నవే. ఆర్థిక నేరాలు 292 నుంచి 344కు హెచ్చాయనీ అన్నారు. కొత్త సంవత్సరాది వేళ వినోదాలూ వేడుకల పేరిట కొంత మంది యువకులు బరితెగిస్తున్నారని, మితిమీరిన వేగంతో అర్ధరాత్రి వాహనాలను నడిపి ప్రాణాంతక స్థితులు తెస్తున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలోనూ నేరాలకు కారకులయ్యే యువకుల సంఖ్య హెచ్చుతోందని ఆయా సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి. అమ్మాయిలను వేధించి బాధించడం వంటివి నానాటికీ పెచ్చుపెరుగుతుండటం మరొక ఆందోళనకర విషయం. తెలుగునాట తీవ్రతర స్థితి వనితల పట్ల నేరపూరిత వర్తన దక్షిణాది అంతటిలోనూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అధికం. ఆ సంఘటనలు ఏపీలో 17,752 నుంచి 25,503కు పెరిగిపోయాయి. తెలంగాణలో ఆ కేసుల సంఖ్య 22,066. రోజుకు 86 రేప్‌లు, గంటకు 49 ఇతర సంఘటనలు ఉంటున్నట్లు సాక్షాత్తు ఎన్‌సీఆర్‌బీ వెల్లడించటం వాస్తవిక స్థితికీ గతికీ సూచిక అవుతోంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నియంత్రణలోని సంస్థే తాజాగా తెలియచేసిన గణాంక సమాచారమిది. ఛార్జ్‌షీట్ రేటును గమనిస్తే– మొత్తంమీద 77.1 శాతం. మహిళలపై నేరాలు 3,71,503 కావడం నేర తీవ్రతకు పరాకాష్ఠ. ప్రస్తుత వాస్తవికతను శ్రీశ్రీ కవితలో సమన్వయిస్తే–

(బాధిత పీడిత ప్రజ పిడికిలి బిగిస్తే)
ఇది సవనం, ఇది సమరం!
ఈ ఎగిరిన ఇనుపడేగ, ఈ పండిన మంట పంట
ద్రోహాలను తూలగొట్టి, దోషాలను తుడిచిపెట్టి
స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాతృత్వం, సౌహార్దం
పునాదులై ఇళ్లు లేచి; జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, కాంతి, కాంతి
జగమంతా జయిస్తుంది, ఈ స్వప్నం నిజమవుతుంది
(దీన్నే ఇంకా విస్తృతం చేస్తే...)
ఆశయ ఖడ్గంతో, దృఢ సంకల్పంతో
ఎదిరించనా ఎన్నిటినైనా– చెదరని చిరునవ్వుతో!




నిజానికి బిడ్డల మీద తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. ఉన్నతంగా చదవాలని, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటారు. కానీ గాడి తప్పిన, దారి మళ్లిన కొంతమంది కుర్రాళ్లు పలు వ్యసనాలకు బానిసలవుతున్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి ఏదో తీవ్ర ఆవేశంతో హేయ నేరాలకు తెగిస్తున్నారు. పలు ప్రాంతాల్లోని గొలుసు దుకాణాల్లో పగలూ రాత్రీ తేడా లేకుండా మాదక ద్రవ్యాలు దొరుకుతుండటమే అనేక నేరాలకు మూలకారణమని తెలుతోంది. ప్రత్యేకించి ఉభయ తెలుగు రాష్ట్రాలోనూ మాదక పదార్థాల అక్రమ తరలింపు కొనసాగుతూనే వస్తోంది. దీంతో యువకులు వర్గాలుగా తయారై చేతికి ఏది దొరికితే దానితో అకారణ దాడులకు దిగుతున్నారు. ఒకచోట మరెక్కడో కాదు, తెలుగుతల్లి విగ్రహం ముందరే కత్తిపోటు సంఘటన ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం. యువకుడి మీద కొందరు యువకులే పట్టపగలే విరుచుకుపడి, ఆ ప్రాంతమంతటా అల్లకల్లోలం సృష్టించారన్నది శాంతిభద్రతల వైఫల్యాన్ని ప్రస్ఫుటం చేస్తోంది. అన్ని రకాల వైఫల్యాలకీ మూలకారణం నేర యువత మీద అదుపు లోపించడం.

### మూలాల్ని పెకిలిద్దాం

అన్నింటికంటే మహా ప్రమాదకరం– బాల్యం దాటని, యౌవనం చేరని దశలో పెరిగే నేరపూరిత మనస్తత్వం. బాల్య నేరం అనవచ్చు దీని. అటువంటి వ్యక్తులు చట్టవిరుద్ధ పనులకు దిగజారడమంటే? అంతకుమించిన సామాజిక వైపరీత్యం



మరోటి ఉండదు. సంఘానికి ఆమోదకరం కాని వాటికి వాళ్లు పాల్పడుతున్నారంటే ఆ లోపం, దోషం, పాపం కన్నవాళ్లదే. మంచి నేర్పాల్సిన ఉపాధ్యాయులదీ ప్రధాన పాత్రే. చెప్పేవాళ్లూ, వినేవాళ్లూ లేకనే నేరాలూ–ఘోరాలూ దాపరిస్తున్నాయి. బాల నేరస్థుడి వయసు నిర్ధారణ ప్రాతిపదికలు ప్రపంచ దేశాల్లో ఒక్కో విధంగా ఉంటున్నాయి. మద్య, ధూమపానాలతో పాటు ఆస్తి సంబంధ, హింస ప్రేరిత నేరాలకూ అక్కడ శిక్షలెక్కువ. లైంగిక అఘాయిత్యాలకు, సైబర్ మోసాలకు ఎవరు పాల్పడినా కఠిన దండనలే.

కచ్చితంగా చెప్పాలంటే నేరం ఎవరు చేసినా శిక్షార్హులే. న్యాయదేవత చూపు ముందు అందరూ ఒక్కటే. ఐక్యరాజ్యసమితి దశాబ్దాల కిందట నిర్వహించిన సదస్సు నేర నియంత్రణ మీదనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. అదే సందర్భంలో శిక్ష/సంస్కరణ పరమైన మార్గదర్శక సూత్రాలనీ రూపొందించింది. మినిమమ్ ఏజ్ ఆఫ్ క్రిమినల్ రెస్పాన్సిబిలిటీని సైతం నిర్ధారించింది. దీన్ని విస్తృపరుస్తే– యువతలో నేర నివారణ మార్గాలూ మన ముందు నిలుస్తాయి. హేయమైన నేరాలకు ఎవరు పాల్పడినా, వాళ్లు 16 నుంచి 18 సంవత్సరాల మధ్యలోని వయస్కులైనా ప్రత్యేక విచారణలూ కఠిన దండనలూ తప్పవు. మరి, కావాలనే దారుణాలకు దిగజారే యువకులను/యువతులను ఏ రీతిన శిక్షించాలన్న దానిపైనా స్పష్టత ఉంటుంది, ఉండాలి కూడా.

### నియంత్రణ సుసాధ్యమే

యువజనుల నేరాల నిర్మూలన సాధ్యం కాదు ఎప్పటికీ, నియంత్రణ/నిరోధ ప్రక్రియలు మటుకు ఎప్పటికప్పుడు ఉండాల్సిందే. అవి కేవలం పోలీసుల వల్లనో, న్యాయస్థానాల ద్వారానో పూర్తిగా సాధ్యమయ్యేవి కావు. సంస్కరణ అనేది, సంస్కారమన్నది ఇంటి నుంచే మొదలవ్వాలి. హక్కులు, బాధ్యతలు మధ్య పోలికలూ తేడాలను యువతకు అర్థమయ్యేలా చేయాలి. శాసన నిర్మాణ,



పాలనా నిర్వహణ, న్యాయవ్యవస్థ పాత్ర, ప్రాధాన్యత ఇందులో అన్ని విధాలా కీలకం. వ్యూహం, సమాచరణ, పర్యవేక్షణ, విశ్లేషణలు పటుత్వంతో ఉంటేనే నేర నివారణ సాధ్యమవుతుంది. కడివెడు పాలలో చుక్క విషం పడినా అంతే సంగతి. పూలవనంలో కలుపుమొక్క ఒక్కటున్నా పలు రీతుల హానికరమే. దుష్య చర్యలకు ఆస్కారమిచ్చే అన్ని పరిస్థితులనీ కట్టడి చేయాల్సిన కర్తవ్యం. సంఘంలోని వివిధ విభాగాల పైన ఉంటుంది. పాఠశాల స్థాయి నుంచీ నీతి విద్యాబోధన, కళాశాల దశలో సైనిక శిక్షణ, సేవా సంబంధ పరికల్పన, విశ్వవిద్యాలయం రీతికొచ్చేసరికి మానసిక పరిణతి స్థాపన అత్యవసరాలు. ప్రణాళికాబద్ధంగా, ఆచరణ భరితంగా ప్రభుత్వం, ఇతర సేవా సంస్థలన్నీ కలిసి పని చేస్తేనే పర్యవసానాలు ఆశాజనకంగా ఉంటాయి. అంతేతప్ప ఏవైనా నేరాలు జరిగితే 'ఇకముందు ఇటువంటివి జరగనివ్వం. పునరావృతం కాకుండా చూస్తాం' తరహా ప్రకటనలు ఎందుకూ కొరగావు. పాలక పక్షాలకు సంకల్ప బలం ఉండాలే కానీ యువజనుల్లోని వివాదాస్పదుల ఆటలు కట్టించడం ఏ ప్రభుత్వానికైనా అసాధ్యం కానేకాదు. సామ, దాన, దండోపాయాలు ఉండనే ఉంటాయి ప్రతీదానికీ. కావాల్సిందల్లా ఏ ఆయుధాన్ని అయినా/సాధనాన్ని అయినా ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రయోగించాలో తెలిసి ఉండటం. దురాగతాలను దురంతాలను తుదముట్టించే అగ్నితరంగాలు కావాలి. ప్రభుత్వ/తదితర సంస్థల వ్యవహార సరళి. మనసంటూ ఉంటే మార్గం అదే కనిపిస్తుంది. నేర నియంత్రణా సమాజ రూపకల్పన చేరువ అయి తీరుతుంది. ఇంటా బయటా దేగ కన్నుల పరంపరలే ఎంతటి మేలునైనా చేస్తాయి, ఎవరికీ ఏ కీడు కలగకుండా రక్షణ ఛత్రాలుగా మారతాయి. యువత సరైన రీతిలో ఉంటేనే ప్రగతి. లేదంటే అధోగతి... తప్పదంతే! ❑





**తయారీ విధానం:** పప్పుల్ని మూడుగంటల ముందు నానబెట్టుకుని ఆ తరువాత సరిపడా నీళ్ల పోసి మూడు కూతలు వచ్చేవరకూ ఉడికించుకోవాలి. అలాగే గుడ్ల సొనను ఓ గిన్నెలో తీసుకుని చిటికెడు ఉప్పు వేసి గిలకొట్టుకుని చెంచా నూనెలో ఆమ్లెట్ మాదిరి వేసుకుని ఆ తరువాత ముక్కల్లా కోసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌మీద కడాయిని పెట్టి..మిగిలిన నూనె, వెన్న వేయాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు వేయించుకుని, అల్లం తరుగు, వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. అవి కూడా వేగాక పసుపు, తగినంత ఉప్పు, టొమాటో ముక్కలు, జీలకర్రపొడి, దనియాలపొడి, గరంమసాలా వేసి కలపాలి. టొమాటో ముక్కలు మగ్గాక కాసిన్ని నీళ్ల పోసి..ఉడికించిన పప్పు వేసి కలపాలి. రెండు నిమిషాలయ్యాక గుడ్డు మిశ్రమం, కసూరీమేథీ వేసి బాగా కలిపి స్టవ్‌ని కట్టేయాలి.

# గుడ్డు రుచులు

## పాలక్ మసాలా గుడ్డు

**కావలసినవి:** పాలకూర తరుగు–మూడు పెద్ద కప్పులు, పచ్చిమిర్చి–రెండు, ఉడికించిన గుడ్లు– ఆరు, నూనె–రెండు టేబుల్‌స్పూన్లు, నెయ్యి–రెండు టేబుల్‌స్పూన్లు, బిర్యానీ ఆకు–ఒకటి, ఉల్లిపాయ ముక్కలు– అరకప్పు, అల్లం–వెల్లుల్లి తరుగు–టేబుల్‌స్పూన్లు, ఉప్పు– తగినంత, కారం– చెంచా, పసుపు– అరచెంచా, దనియాలపొడి– చెంచా, గరంమసాలా–చెంచా, జీలకర్ర–చెంచా, ఎండుమిర్చి–రెండు.

**తయారీ విధానం:** పాలకూర తరుగును అయిదు నిమిషాలు ఉడికించుకుని ఆ తరువాత పచ్చిమిర్చితో కలిపి మెత్తని పేస్టులా చేసుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి..నూనె వేసి బియ్యానీ ఆకు, ఉల్లిపాయముక్కలు, అల్లంవెల్లుల్లి తరుగును వేయించుకోవాలి. తరువాత పాలకూర మిశ్రమ, తగినంత ఉప్పు, కారం, పసుపు, గరంమసాలా, దనియాలపొడి వేసి పావుకప్పు నీళ్ల పోయాలి. ఈ మిశ్రమం ఉడుకుతున్నప్పుడు గుడ్డు ముక్కల్ని వేసి అయిదు నిమిషాలయ్యాక దింపేయాలి. మళ్లీ కడాయిని పెట్టి నెయ్యి వేసి జీలక్రర, ఎండుమిర్చిని వేయించుకుని కూరలో వేసి కలిపితే చాలు.

## ఎగ్ తడాకా మసాలా

**కావలసినవి:** పెసలు, సెనగపప్పు, పావుకప్పు, గుడ్లు రెండు, నూనె–పావుకప్పు, ఉప్పు– తగినంత, వెన్న– టేబుల్‌స్పూను, బిర్యానీఆకు–ఒకటి, వెల్లుల్లి తరుగు–చెంచా, అల్లం తరుగు– చెంచా, పచ్చిమిర్చి–రెండు, టొమాటో– ఒకటి, కారం– చెంచా, పసుపు–అరచెంచా, జీలకర్రపొడి–అరచెంచా, దనియాలపొడి–చెంచా, గరంమసాలా–అరచెంచా, కస్తూరీమేథీ– చెంచా.



## స్టీమ్డ్ ఎగ్ కర్రీ

**కావలసినవి:** గుడ్లు– మూడు, ఉల్లిపాయ ముక్కలు–పావుకప్పు, టొమాటో తరుగు–అరకప్పు, పసుపు–పావుచెంచా, ఉప్పు–తగినంత, మిరియాలపొడి–పావుచెంచా, నూనె–పావుకప్పు, ఆవాలు– చెంచా, మినప్పప్పు– చెంచా, కరివేపాకు రెబ్బలు–రెండు.



**మసాలాకోసం:** కొబ్బరి తురుము–అరకప్పు, జీలకర్ర–అరచెంచా, గసగసాలు–అరచెంచా, దాల్చినచెక్క– చిన్నముక్క సోంపు– చెంచా, లవంగాలు–మూడు, పచ్చిమిర్చి– మూడు, దనియాలు–చెంచా, వెల్లుల్లి రెబ్బలు–నాలుగు.

**తయారీ విధానం:** ఓ గిన్నెలో గుడ్ల సొన, పావుచెంచా ఉప్పు, మిరియాలపొడి వేసుకుని నురగవచ్చేలా గిలకొట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఆవిరిమీద పది నిమిషాలు ఉడికించుకుని ఆ తరువాత ముక్కల్లా కోయాలి. అలాగే మసాలా కోసం పెట్టుకున్న పదార్థాలను మిక్సీలో వేసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. స్టవ్‌మీద కడాయిని పెట్టి, నూనె వేసి ఆవాలు, మినప్పప్పు, కరివేపాకు వేయించుకుని ఉల్లిపాయ ముక్కలు వేయాలి. అవి ఎర్రగా వేగాక టొమాటో తరుగు, పసుపు, తగినంత ఉప్పు, చేసిపెట్టుకున్న మసాలా వేసి కలిపి ఒకటిన్నర కప్పుల నీళ్లుపోయాలి. ఇది ఉడుకుతున్నప్పుడు ఉడికించి కోసం పెట్టుకున్న గుడ్డుముక్కలు వేసి అయిదు నిమిషాలయ్యాక దింపేస్తే సరి.

# ఆధునిక జీవనశైలి

రాము కోలా

**ఆధునిక జీవనశైలిలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ కనుమరుగు అవుతున్నదనేది వాస్తవం. ఉరుకులు పరుగుల జీవితంలో, మనిషి తన గురించి తానుగా పట్టించుకునే సమయం తన కోసం కేటాయించుకోలేక, తన మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు, దురలవాట్లను ఆశ్రయిస్తున్నాడు అనేది నూరు శాతం నిజం.**





కానీ కొందరు దీన్ని ఒప్పుకోనకపోవచ్చు! ఇంట్లో గడిపే కాస్త సమయంలోనూ మొబైల్, ల్యాప్‌ట్యాప్ చాటింగ్‌తో గడిపేస్తూ, తనని తానే ఒంటరిని చేసుకుంటూ, తన చుట్టు ఉన్న కృత్రిమ పరిచయాల్లో అనుబంధాలను ఆప్యాయతలను వెతుకుతూ అలసిపోతున్నాడు ఎంత స్వార్థం. దూరపు కొండలు నునుపు అనే సామెతను నిజం చేస్తూ సకుటుంబ సమేతంగా కలిసి భోజనాలు కూడా చేయలేనంతగా బిజీబిజీ జీవితాన్ని, సోషల్ మీడియాలో గడిపేస్తూ సాంప్రదాయాలను గాలికే వదిలేస్తూ, పాశ్చాత్యుల సంస్కృతి వైపుకు ఆకర్షితులవుతున్న యువతను తయారు చేస్తున్న కార్ఖానాలుగా మన గృహాలు మారుతున్నాయి, మార్చేస్తున్నారు. దీనికి బాధ్యులు ఎవరు? ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం. ఇది ఎవ్వరు కాదన్నా వాస్తవం.

సంపాదనా వ్యామోహంతో పిల్లల్ని హాస్టల్లో పడేస్తూ, ఇంట్లోని తల్లిదండ్రులను అనాథాశ్రమంలో వదిలేస్తూ, ఫాస్ట్‌ఫుడ్‌తో కాలక్షేపం చేస్తున్నారు. ఆప్యాయంగా పలకరింపులు లేవు. కష్టసుఖాలు పంచుకునేందుకు, మానసిక ధైర్యం అందించే పెద్దలు లేని కుటుంబ, స్మశానస్థలిని గుర్తు చేస్తుంది. హద్దు అదుపులేని జీవితాలు నియంత్రణ కోల్పోతూ, మారకద్రవ్యాలకు అలవాటుపడుతూ, సమాజాన్ని నాశనం చేస్తున్నారు. ఒకప్పటిలా చిన్నతనం నుండి, వేమన పద్యాలు, సుమతీ శతకాలు, పెద్దబాల శిక్ష, పురాణం ఇతిహాసాలు చదివించేవారు. పెద్దలు మన ఇంట్లో లేకపోవడంతో, కార్పొరేట్ విద్యాలయాల్లో పోటీపరీక్షల పేరుతో పుస్తక పరిజ్ఞానం తప్ప, మరో ప్రపంచం లేదు అనేలా తయారు చేస్తుంటే..తనకు తానుగా ఆలోచించగల నేర్పును కోల్పోతున్న యువతకు, నేడు ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. కలిసి ఉంటే కలిగే ప్రయోజనాలు ఎన్నో మన కుటుంబం అనుకునే దానిలో ఉన్న తృప్తి, నాన్నమ్మ తాతయ్యాలు చెప్పే, చారిత్రక సంఘటనలు, వారి అనుభవాలు, వారు ఎదుర్కొన్న, సమస్యలు, వాటిని పరిష్కరించడానికి కుటుంబ సభ్యులు అందించిన సహకారం తెలుసుకోవడం వలన మనకు ఎదురైన సమస్యలను మానసికంగా ఎదుర్కొనే మనోధైర్యం ఏర్పడుతుంది. సినిమాల్లోనో, టీవీ సీరియల్స్ లోనో చూస్తూ ఇలా ఉంటుందా ఉమ్మడి కుటుంబం అనుకునే వారు. తమ కుటుంబాలను ఉమ్మడి కుటుంబాలుగా కలుపుకునే ప్రయత్నం చేయండి. సుఖసంతోషాలు నిత్యం మీతోనే ఉంటాయనేది వాస్తవంగా చూస్తారు. ప్రయత్నించండి. ఆప్యాయతల ఆనందంలో తేలిపోదాం. ❑





**వాళ్లమ్మతో** వస్తోంది/ బుజ్జిపిల్ల
ఆమె చూపుడు వేలు బిగించి పట్టుకొని
చుట్టూ చూస్తూ బుడిబుడిగా నడుస్తోంది.
ఎందుకో! ఏ వింత కనబడిందో
నా ముఖంలోకి చంద్రిక వంటి తన ముఖం పెట్టి
చిటుక్కున నవ్వింది/ నేనొక బాలభానుణ్ణై
ప్రేమకాంతితో దీవించాను./ ముద్దబంతి పువ్వులా ఉంది
నుదిటిన పెద్ద కుంకుడు గింజంత
నల్లటి బొట్టు/ తెల్లదనంపై పైచేయిగా
నల్ల నక్షత్రంలా
చూడముచ్చటగా ప్రకాశిస్తోంది
పసుపుచ్చని పసి

# బాల చంద్రిక

దుస్తుల్లో
పండిన మామిడి
పిందెలా కదుల్తోంది
చెప్పులు మీద
రెండు బొమ్మలు రెండు పువ్వుల్లా ఉన్నాయి.
ఆ చిన్నితల్లి తొడుక్కున్నందుకు
అవి రెట్టింపైన అందంతో ముందుకెళ్తున్నాయి.
పోతూ పోతూ/ తల వెనక్కి తిప్పి మళ్లీ చూసింది
ఆ చిట్టి పాపాయి/ కుందనపు బొమ్మలా ఉంది
పిల్లలు/ పిల్లల్లా చూస్తారు/ ఆ చల్లదనానికి
ఎంతటి క్రోధ ఖడ్గమైనా
క్షణంలో/ శాంతిపువ్వై పరిమళిస్తోంది.

**- రవి నన్నపనేని**

# రమణీయం

## ఈవారం కవిత్వం

ఒకవైపు
నిటారు ఆకాశం
మరొక వైపు
వాలుమేఘం.
కొన్ని తడి చినుకులు
గుబురు కొమ్మల్లో
పక్షుల కువ, కువలు
ఇంద్రధనుస్సు రంగులు.
నేలంతా ఆకుపచ్చని హంగులు
ధరణిపై నిలిచి
నిత్యం మురిపించే
రమణీయ దృశ్య కావ్యం!

**- చిల్లెం మహబూబ్ బాషా**




# తెలుగు..జగతికి వెలుగు



నన్నయ్య నడిపించిన భాష
తిక్కన మెరిపించిన భాష
ఎర్రన మురిపించిన భాష
మధురమైన మన తెలుగుభాష.
పుడమి పరిమళం మన తెలుగు
పారిజాత సుమదళం మన తెలుగు
గగనాన హరివిల్లు మన తెలుగు
భువిలోన విరాజిల్లు మన తెలుగు.
అమ్మభాష అనురాగం
తెలుగు పలుకుల మమకారం
తెలుగుభాష తీయదనం
తేటతెలుగు గొప్పదనం.
మాతృభాష మన తెలుగుభాష
తేనెలొలుకు కమ్మని భాష
మధుధురమైన మన తెలుగుభాష
నవరసాల అందమైన భాష.
తెలుగువాళ్లం మనమంతా
తెలుగుదనం మనదంతా
తెలుగుతేజం మనది
తెలుగు పరిమళం వాడనిది.

**- కాయల నాగేంద్ర**



# 'శివ చిలుకలు' తనికెళ్ల భరణి

చలన చిత్రరంగంలో ప్రతిభావంతుడైన తనికెళ్ల భరణి, చిలుక పలుకులలో శివతత్త్వాన్ని, 'శివచిలుకలు' శీర్షికగా 108, అయిదు చరణాలరాగ్ర సంపుటిగా, అక్షజ్ఞ ప్రచురణ సంస్థ వెలువరించింది. 'శివచిలక' అనే మాట రచయిత హృదయాన్ని ఆకట్టుకోవడం కారణంగా ఉద్భవించిన చరణాలలో శివభక్తి తాదాత్మ్యత ఉట్టిపడు తోంది. ప్రతీనాల్గవ వాక్యం ఓ శివచిలుకా.. మకుటరీతిలో సాగిన ఈ సంపుటి, బాలుగారి ప్రశంసలు పొంది భరణి నోటి పాటగా గానం చేయబడి వేనోళ్ల మన్నన పొందుతోంది. తెలుగులో తంబుర మీటుతూ బైరాగులు పాడేతత్వాలు పల్లెహృదయాలను తన్మయింప చేసినట్టే, తనికెళ్ల భరణి శివచిలుకల తాత్త్విక చింతనను కవిగా, గాయకునిగా శ్రోతలకు వీనులవిందుగా అందించారు. భక్తిభావ తత్పరణతో శివసౌందర్యం ఏవో లోకాలలో విహరింప చేసేటట్టుగా, శివచిలుకలు గూడువదిలి ఎగరడం, భరణి హృదయంలో దాక్కున్న వైరాగ్య భావనను వినిపింప చేస్తున్నాయి. తొలిగా గణేశస్తుతిలో తొండం దేవరకి ఉండ్రాలెడదాములేతో శ్రీకారం చుట్టి, వేల అడుగులు వేల ఆరడుగుల నేల అంటూ గాఢమైన భావనతో గుండె స్పృశిస్తారు. బ్నిం, వెంకట్, విద్యాభార్గవి సారధ్యంలో 'శివచిలుకలు' తెలుగు ప్రజలకు భరణి వెలిగించిన చిరంతన, చిన్మయదీప్తి ప్రసరింపచేసే అద్భుతకానుక. **(శివ పలుకులు, రచన: తనికెళ్ల భరణి, వెల: రూ 120, ప్రతులకు: వెంకట్, అక్షజ్ఞ పబ్లికేషన్స్, 12-11-1364, పరాశర అపార్ట్‌మెంట్, 2వ అంతస్తు, సికింద్రాబాద్)**

**- యర్రమిల్లి**

## విశ్వపుత్రిక సమగ్ర కవిత్వం-ఓ విహంగ వీక్షణం



ప్రముఖ కవయిత్రి డా॥పి.విజయలక్ష్మి పండిట్ 'విశ్వపుత్రిక సమగ్ర కవిత్వం' పేరిట ఓ బృహద్గ్రంథాన్ని వెలువరించారు. 'విశ్వపుత్రిక' ఆమె కలం పేరు. యిది కవయిత్రి సృజించిన ఎనిమిది పుస్తకాల కవిత్వ సమగ్ర సంకలనం. 'పాలపిట్టబుక్స్' ప్రచురణ. ఒకే పొత్తంలో వచన కవిత, దీర్ఘకవిత, హైకూలు పొందుపరచడం వల్ల పాఠకులు అద్భుతానుభూతులకు లోనవ్వడం ఖాయం. మనుషుల్లో కనుమరుగవుతున్న మానవత్వాన్ని ప్రశ్నిస్తు రాసిన కవిత్వ సంపుటి 'మానవత్వమా ఏదీ నీ చిరునామా?' మొత్తం 43 కవితలు. గ్లోబల్ వార్మింగ్, ప్రకృతి విధ్వంసం, వాతావరణ కాలుష్యం నేపథ్యంలో రాసిన దీర్ఘకవిత 'ధరిత్రీ విలాపం'. మానవుడి స్వయం కృపారాధనని కళ్లకు కట్టిన కవిత. స్త్రీల స్థితిగతులతో కూడిన స్త్రీవాద కవిత్వం 'ఆకాశంలో అర్థభాగం'. ప్రకృతిలోని అన్ని జీవులతో సహజీవనం, విశ్వప్రేమ, విశ్వశాంతి తన ఆశయంగా విజయలక్ష్మి పండింట్ వెలువరించిన దీర్ఘకవిత 'విశ్వపుత్రికను నేను'. తనకు 'కవిత్వం కాని జీవితం ఎడారి సదృశం' భావనతో కవయిత్రి వెలువరించిన కవిత్వపొత్తం 'నా ఆత్మకళలు' ఠాగోర్ 'గీతాంజలి'కి తెలుగు అనువాదం 'అపూర్వ గానం'. అలాగే 'నా అక్షరాలు' అనేది మరో 46 కవితల సంపుటి. 'యోగరేఖలు', 'రాగ రేఖలు' అనేవి రెండు గజల్ల సంపుటాలు. విజయలక్ష్మి పండిట్ సాహిత్య ప్రస్థానాన్ని పరికించడం ఓ చక్కని అనుభవం. **(విశ్వపుత్రిక, రచన: డా॥పి. విజయలక్ష్మి పండిట్, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్) - రమణ వెలమకన్ని**

# పుస్తక సమీక్ష

## మా'నవ'వాదం దేవరాజీయం

తెలంగాణ వీణలో రత్నాలుగా ఒదిగిన, ఎదిగిన ఎందరో మేధావులు, సామాజిక వైజ్ఞానికవేత్తలలో దేవరాజు మహారాజు ఒక మహత్తర రత్నం. చదివింది జీవశాస్త్రం. కాని తర్వాతకాలంలో 'మానవజీవన శాస్త్రాన్ని' తన అధ్యయనం కేదారంగా ఎంచుకున్నారు. నాటి ఆరుద్ర, శ్రీశ్రీ, సినారేలాంటి వారల ప్రశంసలు పొందిన ఈ రాజు, సైన్సు ప్రచారసాహిత్యంలో యువరాజు కాదు, 'మహారాజు'. 1951లో జన్మించిన దేవరాజు మహారాజు 70ఏళ్ల పూర్తి



చేసుకున్న శుభ సందర్భంగా వెలువరించిన 'డా॥దేవరాజు మహారాజు సప్తతి' సంచిక ఇది. 2011లో 'ఆవరణం'తో సాహితీ వజ్రోత్సవం జరుపుకున్నారు. మొదటి కవితాసంపుటి 'గుడిసె గుండె' నుంచి 1974లో మొదలైన సాహితీ ప్రస్థానం 1991లో 'సైన్సు ప్రచార సమరం' అనే మలుపు తిరిగింది. కవిత్వం, కథలు, బాలసాహిత్యం, నవల, సాహిత్య విశ్లేషణ, నాటికలు, పాపులర్ సైన్సు ఆయన స్పృశించని విషయం లేదు. ఏది తీసుకున్నా మూలాల్లోకి వెళ్లి శోధించేతత్వం మహారాజుది. ప్రస్తుత సప్తతి సంచికలో మహారాజు కృషి ప్రస్తుతిస్తూ, 15 వ్యాసాలు, 8 ఇంటర్వ్యూలు, 10 పుస్తక పరిచయాలు సమీక్షలు 6 కవితలు 29 శుభాకాంక్షలు మరో 17 ఇతర వ్యాపాలున్నాయి. కొండను అద్దంలో చూపించినట్లున్న ఈ సంచిక ద్వారా దేవరాజు మహారాజు సాహిత్యాన్ని ఎంతగా సుసంపన్నం చేసారో తెలుస్తుంది. ఇంటింటా ఉండవలసిన గ్రంథ 'మహారాజం' ఇది. **(డా॥దేవరాజు మహారాజు సప్తతి, సంపాదక వర్గం: డి.హనుమంతరావు, తదితరులు, వెల: రూ 200, ప్రతులకు: అన్ని ప్రముఖపుస్తకశాలలు)** - కూర చిదంబరం

## ప్రపంచ విజేతలు-వ్యక్తిత్వ నిర్మాణం



సుశీల నారాయణరెడ్డికి ఈ పుస్తకం అంకితం చేసారు రచయిత. దాదాపు 17 చాప్టర్స్ (అధ్యాయాలు) ఈ పుస్తకంలో వున్నాయి. కార్ల్‌మార్క్స్, రవీంద్రనాథ్‌ఠాగూర్, ఖలీల్‌జిబ్రాన్, జేమ్స్ ఆలిసన్, నర్గీస్‌లాంటి వారి వ్యక్తిత్వాన్ని విశ్లేషణతో స్త్రీల సాధికారిత ఆహార విప్లవం కోరికలను అదుపు చేయడం ఎలా? లాంటి అంశాల్ని శాస్త్రీయంగా విశ్లేషించారు. వ్యక్తిత్వనిర్మాణం ఓ శిల్పం, ఆరోగ్య శిల్పం, సౌందర్యం, కళ, జీవనశిల్పం, కవి దృష్టిలో ప్రేమ, శాస్త్రవేత్తలు వ్యక్తిత్వ నిర్మాణం, తాత్త్విక వ్యక్తిత్వ నిర్మాణం, ప్రపంచ వ్యక్తిత్వ వికాసం, నోబుల్ బహుమతిగ్రహీత ఎలినెక్ వ్యక్తిత్వం బేరీజు వేస్తూ ఈ రచన ఎంతో విజ్ఞానదాయకంగా సాగింది. ఠాగూర్, మార్క్స్ వ్యక్తిత్వాల విశ్లేషణ చాలా బాగుంది. ఈ రోజు ప్రపంచం మార్క్స్‌ను అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతో వుంది. ఒకనాడు భూమి అందరిది, రాజ్యాధికారభావన, బానిస సమాజం, ఉత్పత్తి శక్తుల పైచేయి వర్గపోరాటం పెట్టుబడిదారీ భూస్వామ్య వ్యవస్థల దోపిడి సామ్యవాద భావన పెట్టుబడి గ్రంథ విశిష్టత బలంగా రాశారు రచయిత (పే.జి.250-276). ఒక సిద్ధాంతవేత్తగా, తత్త్వవేత్తగా, బహుజనపోరాట సామాజికోద్యమాల్ని నిర్మించిన కత్తిపద్మారావు కృషి అభినందనీయం. **(వ్యక్తిత్వ నిర్మాణం, రచన: కత్తిపద్మారావు, వెల: రూ 600, ప్రతులకు: లోకాయుత పబ్లికేషన్స్, పొన్నూరు, గుంటూరుజిల్లా)** - తంగిరాల చక్రవర్తి

# ఆధునిక పెళ్లికూతురు



**చందమామ** కథల్లోని రెక్కల గుర్రంమీదో బాలమిత్ర కథల్లోని హంసనావలోనో తన కలల రాకుమారుడు వస్తాడనీ..ఊరేగిస్తూ వెంట తీసుకెళతాడనీ.. నమ్మడానికి ఎంత బాగుందో వంటి ఊహలతోనే సరిపెట్టుకునేవారు ఒకతరం అమ్మాయిలు. కానీ ఈతరం పిల్లలకు ఆ అవసరం లేదు. ఈ కథలు తెలియకున్నా వాటి గురించి కలగనకున్నా ఆ అందమైన ఫెయిరీటేల్స్‌ను నిజం చేసి చూపిస్తున్నారు ఈనాటి అమ్మానాన్నలు. అమ్మాయైనా అబ్బాయైనా పుట్టినప్పటి నుంచి పెళ్లి వరకూ రకరకాల వేడుకల్ని తమకు ఉన్నంతలో ఘనంగా చేయాలని ఆరాటపడుతున్నారు నేటితరం తల్లిదండ్రులు. అందుకోసం వేదిక ఎంపిక నుంచి విందు భోజనాల వరకూ తమదైన ప్రత్యేకత కనిపించేలా చేసి అతిథుల్ని చకితుల్ని చేస్తున్నారు. అందులోనూ వేడుకకు సంబంధించి మిగిలిన తంతులన్నీ ఒకెత్తయితే, వాళ్లను వేదికమీదకు ప్రవేశపెట్టడం మరొకెత్తు అని చెప్పుకోవాలి. పుట్టినరోజు, ఓణీ/పంచెల పేరంటం, పెళ్లి..ఇలా ఫంక్షన్ ఏదయినా కావచ్చుగాక తమ గారాల బిడ్డల్ని రాజసం ఉట్టిపడేలా వాహనాల్లో ఊరేగింపుగా తీసుకురావడం ట్రెండ్‌గా మారింది.

అవునుమరి..చిన్నారి పుట్టగానే ఇంటిల్లిపాదికీ ఎంత సంబరం..ఆ ఆనందాన్ని పదిమందికీ పంచుతూ చేసేవే బారసాల, అన్నప్రాసన..వంటి వేడుకలన్నీ. ఇవన్నీ ఎలాగున్నా మొదటి పుట్టినరోజు గ్రాండ్‌గా చేయడం సంప్రదాయంగా మారింది. అందులోనూ కొత్తదనం కోసం ఈమధ్య పూలతో అలంకరించిన చక్రాల బండ్లూ కార్లూ గుర్రాలున్న చిట్టి రథాల్లో బుజ్జాయిల్ని వేదిక దగ్గరకు తీసుకొస్తున్నారు. దీపకాంతులతో బెలూన్లతో అలంకరించిన పరిసరాలను చూస్తూ బోసినవ్వులు చిందిస్తూ వచ్చే ఆ చిన్నారుల్ని చూస్తుంటే కన్నవాళ్లకే కాదు..చూసేవాళ్లకే ముచ్చటే మరి!

ఆ తరువాత భారీయెత్తున చేసే ఫంక్షన్ అంటే..అమ్మాయిలకి ఓణీలు, అబ్బాయిలకి పంచెల పేరంటమే. ఇవన్నీ చిన్నసైజు పెళ్లిలానే చేస్తున్నారీమధ్య. వీటికి సైతం యువరాణీ యువరాజుల్లా అలంకరించిన తమ చిన్నారుల్ని సిండ్రెల్లా క్యారేజీలూ, వెరైటీ పల్లకీలూ, బాహుబలి సింహాసనాలూ, సూర్యుడు రథాన్ని పోలిన వాహనాల్లో కూర్చోబెట్టి బాణసంచాలతోనూ మేళతాళాలతోనూ తీసుకొస్తున్నారు. లిక్విడ్ నైట్రోజన్ సృష్టించే రంగుల పొగలతో మేఘాల్లోంచి తేలి వస్తున్నట్లుగా ఏర్పాటు చేసేవాళ్లు కొందరైతే, అంగరక్షకులు వెంట వస్తున్నట్లో లేదా దేవకన్యల్లా అలంకరించుకున్న డ్యాన్సర్ల నృత్యగానాలతోనో సినిమాటిక్ ఎంట్రీలతో తమ గారాలపట్టినను ప్రవేశపెట్టే వాళ్లు మరికొందరు. చిన్నప్పుడే ఈస్థాయిలో ఉంటే..ఆ చిన్నారులు పెరిగి పెద్దయ్యాక చేసే పెళ్లి వేడుకలో ఎంట్రీ



మామూలుగా ఉంటుందా ..పెళ్లికి వచ్చినవాళ్ల కళ్లు చెదరాల్సిందే అన్నట్లుగా సరికొత్తగా రూపుదిద్దుకుంటున్నాయా ఎంట్రీ కార్డులు. అసలే ఇది పెళ్లిళ్లకాలం..గతనెల చివరి వారం నుంచి ఈ నెల వరకూ సుమారు 35లక్షల వివాహాలు జరగనున్నాయనీ, ఇందుకోసం సుమారు ఐదులక్షల కోట్లు ఖర్చు చేయనున్నారనీ 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్' నిర్వహించిన సర్వే చెబుతోంది.



అందులో ఎంట్రీకార్డ్ల ఖర్చు ఓ భాగమే. ఎందుకంటే వీటి సైజు, అలంకరణ, డిజైన్ని బట్టి పదివేల నుంచి లక్ష రూపాయల పైచిలుకే అద్దె చెల్లించాలి మరి. ఈ ఎంట్రీకార్ట్లో కూడా రాజులూ రాణులూ ప్రయాణించే రథాల్నీ, పాశ్చాత్య వింటేజ్ క్యారేజ్లను పోలిన వాటినీ కొందరు ఇష్టపడుతుంటే, తామరపువ్వు పల్లకీ, సింహం, నెమలి ఆసనాలూ, బాహుబలి గద్దె, హంసనావ..వంటి భారీ వాహనాలమీద మరికొందరు మక్కువ చూపిస్తున్నారు. వెరైటీ కోరుకునేవారయితే ఫంకీ లుక్ను తీసుకొచ్చే కార్టూన్ బొమ్మలున్న స్కూటర్, బైక్, ఆటో, జీప్..వంటి వాహనాల్లో యమాజోష్తో ఎంట్రీ ఇచ్చేస్తున్నారు. ఈమధ్య అమ్మాయినీ అబ్బాయినీ ఒకేసారి ప్రవేశపెడుతున్నారు కొందరు. అయితే ఈ సంప్రదాయాన్ని పెళ్లికి ముందు లేదా తరువాత ఇచ్చే రిసెప్షన్కి పాటిస్తున్నారు. అలాంటి సందర్భాల్లో కొత్తగా వచ్చిన జోర్బ్ బాల్ ఎంట్రీ కూడా ప్రత్యేకంగా కనిపిస్తుంది. దీపకాంతులమధ్య పారదర్శక బెలూన్లా ఉన్నదాంట్లో వధూవరులిద్దరనీ తీసుకొచ్చే దృశ్యం చూసేవాళ్ల కళ్లకు విందే మరి. కొత్తగా ఎన్ని రకాలు వచ్చినా పెళ్లి వేదిక దగ్గరకు తమ రాజకుమారిని తీసుకురావడానికి పల్లకీని మించిందేముందే అనేవాళ్లే ఎక్కువ. సింహాసనంలాంటి పల్లకీలో ఊరేగింపుగా తీసుకొస్తూ పల్లకీలో 'పెళ్లికూతురు రాణీలా ఉంది..మహారాణీలా ఉందీ' అన్న పాట బ్యాక్గ్రౌండ్లో వస్తుంటే..ఆ దృశ్యాన్ని చూసే తల్లిదండ్రులకే కాదు..అతిథులందరికీ కన్నులపండుగే.

ఒకప్పుడు అమ్మాయిని అత్తారింటికి చీరసారెలతో పల్లకీలో పంపేవారు. ఆ పల్లకీలో అమ్మాయి పుట్టింటివారిని తలచుకుని బాధపడుతూ కొత్త కాపురం గురించిన కోటి ఆశలతో అందమైన



ఊహలతో అత్తింట అడుగుపెట్టేది. అది కాస్తా క్రమంగా మరెన్నో రూపాల్ని సంతరించుకుని ఎంట్రీకార్ట్గా మారింది. అందుకు కాల్పనిక కథలతో తీసిన సినిమాలూ కారణమే. అందులోని హీరో, హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోకుండా పెళ్లి బట్టలతోపాటు ఎంట్రీకార్ట్లనూ ఏరికోరి ఎంపిక చేసుకుంటున్నారు. వాళ్ల కోరికల్ని పసిగట్టిన ఉత్పత్తిదారులు ఇనుము, ఇత్తడి, చెక్కలతో తయారుచేసిన ఎంట్రీకార్డ్లకు పుత్తడి పూతలతో మెరుగులద్ది పూలతోనూ ఎల్ఈడీ దీపాలతోనూ ఆడంబరంగా తీర్చిదిద్ది అద్దెకి ఇస్తున్నారు. పైగా ఈమధ్య పెళ్లిళ్లలో ఆంబియెన్స్కి ప్రాధాన్యం పెరిగింది. పచ్చని లాన్లో పూలపందిరి సెట్ వేసి మరీ చేస్తున్నారు. ఆయా రిసార్టులూ పంక్షన్ హాల్స్ నిర్వాహకులే వీటినీ ఏర్పాటు చేస్తున్నారు. దాంతో రకరకాల వాహనాల్లో వధూవరులు వినూత్నంగా ఎంటీ ఇస్తూ..అందరి చూపుల్నీ కట్టిపడేస్తున్నారు.



## చల్లని అద్దాలు

గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని చూస్తూనే ఉన్నాం. గత ఏడాది జులై నాలుగో తేదీ గత లక్షా ఇరవై అయిదు సంవత్సరాల్లో అత్యంత వేడిగా ఉన్న రోజు అని లెక్కించారు. కారణమేదయినా ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. దాంతో విద్యుచ్ఛక్తి వినియోగం కూడా పెరుగుతోంది. దాన్ని తగ్గించేందుకే యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్కు చెందిన పరిశోధకులు కొత్త అద్దాలను రూపొందించారు. భారీ భవంతులకు ఈ అద్దాలను అమర్చడం వల్ల విద్యుచ్ఛక్తి అవసరం లేకుండానే లోపల గదుల్లో వేడితగ్గుతుందట. ఈ అద్దాలకు వేసిన రంధ్ర భరితమైన కోటింగ్ వల్ల మధ్యాహ్న సమయంలో 3.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తగ్గించవచ్చు అని చెబుతున్నారు. అంటే ఈ పూత సూర్యరశ్మిని గ్రహించకుండా, దాన్ని తిప్పికొట్టి లాంగ్వేవ్ ఇన్ఫ్రారెడ్ రేడియేషన్ రూపంలో విశ్వంలోకి వెళ్లేలా చేస్తుంది. ఈ ప్రక్రియను రేడియేటివ్ కోలింగ్ అంటున్నారు. అంటే భవంతుల నుంచి వచ్చే వేడిని చల్లని అంతరిక్షం గ్రహిస్తుందన్నమాట. గతంలో రూపొందించిన కోటెడ్ గ్లాస్లతో పోలిస్తే ఏ వాతావరణాన్ని అయినా తట్టుకుంటుంది గాజు.



## బొమ్మే చల్లబరుస్తుంది!

జ్వరం వచ్చినప్పుడు ఒంటోని వేడిని తగ్గించడానికి కూల్ ప్యాక్నీ, ఏదైనా నొప్పిగా ఉన్నప్పుడు ఉపశమనం కోసం హాట్ ప్యాక్నీ వాడుతుంటాం. పెద్దవాళ్లయితే ఎలాగోలా పెట్టుకుంటారు కానీ బుజ్జాయిల్ని ఒప్పించి వాటిని వాళ్ల దగ్గరకు తీసుకెళ్లడమే చాలా కష్టమైన పని. అలాంటి సమస్యను నేరుగా గమనించారో ఏమో తయారీదారులు.. పండ్లూ, టెడ్డీబేర్ బొమ్మల్లా ఉండే హాట్ అండ్ కూల్ ప్యాకుల్ని తీసుకొచ్చారు. హీటింగ్ ప్యాడ్ స్టఫ్డ్ యానిమల్ అండ్ కూలింగ్ ప్యాడ్, టాయ్ వార్మ్ అండ్ కూల్ ప్యాడ్ అంటూ రకరకాల పేర్లతో దొరుకుతున్నాయివి. వీటిల్లో కొన్నింటిని విద్యుత్తుకు కనెక్ట్ చేసుకుని హాట్ ప్యాకుల్లా మార్చుకోవచ్చు. మరికొన్నింటినీ వేడి కోసం ఒవెన్లో, చల్లదనం కోసం ఫ్రిజ్లో ఉంచేసి ఉపయోగించుకోవచ్చు. ఏదిఏమైనా ఇవన్నీ కూడా ఆడుకునే బొమ్మల్లానే ఉన్నాయి కాబట్టి చిన్నారులే అడిగి మరీ ఇష్టంగా దగ్గరకు తీసుకుంటారు.



## కథ

# ఎవరు గొప్ప

**పచ్చని** హారం అనే అడవిలో సుబుద్ధి అనే కాకి దుర్బుద్ధి అనే కోకిల ఉండేవి. అవి రెండూ ఎప్పటినుంచో కలిసిమెలిసి స్నేహంగా ఉండేవి. కొన్నాళ్ల గడిచాక దుర్బుద్ధికి మనసులో ఒక చెడు ఆలోచన వచ్చింది. ఈ సుబుద్ధి కంటే అన్ని విషయాల్లోనూ నేనే గొప్ప దాన్ని. నేను గొంతెత్తి పాడితే అడవంతా ఆదమరిచి నా పాట వింటుంది. ఈ సుబుద్ధి అరిస్తే 'అబ్బా! ఏంటీ కాకిగోల అని అందరూ ఈసడించుకుంటారు. దీనికి నా విలువ ఏంటో తెలియజేయాలి' అని మనసులో అనుకుంది. ఒకరోజు 'ఓ సుబుద్ధి! ఆగాగు నీకో విషయం చెప్పాలి' అన్నది, ఆహారం కోసం ఎక్కడికో వెళ్లబోతున్న కాకిని ఆపి 'ఏంటి విషయం' అని సుబుద్ధి అడిగింది. 'ఇక నుంచి నేనెప్పుడు కనిపించినా నువ్వు నాకు నమస్కారం పెట్టాలి అప్పుడే మిగిలిన పక్షులు కూడా మరింతగా నా గొప్పతనాన్ని గుర్తిస్తాయి. నేను చెప్పింది అర్థమైంది కదా!' అని అడిగింది. 'నాకంటే నువ్వు ఎలా గొప్ప దానివి, అయినా ఎవరి గొప్పతనం వాళ్లది. నేనెందుకు నీకు రోజూ నమస్కారం చెయ్యాలి. నీ మాటలు నాకు రుచించలేదు' అన్నది సుబుద్ధి. ఇంతలో దూరంగా ఒక కోతి కనిపించింది. దాని పేరు మారుతి. అయితే ఆ మారుతీ! దగ్గరికి వెళ్లి మనిద్దరిలో ఎవరు గొప్ప అనే విషయం అడిగి తెలుసుకుదాం' చెప్పింది దుర్బుద్ధి. 'సరే వెళ్దాం పదా!" అంది సుబుద్ధి. 'ఓ కోతి బావ! కోతి బావ! మా ఇద్దరిలో ఎవరు గొప్ప నువ్వే చెప్పాలి అని అడిగింది దుర్బుద్ధి. 'ఈమధ్య మీ మధ్య ఈ తగాదా ఎందుకు వచ్చింది? మీరు మొదటినుంచి స్నేహంగా పాలు నీళ్లలా కలిసిపోయి ఉండేవారు కదా!' అని అడిగింది మారుతి. 'నా గొంతు వింటే మన అడవిలో ఉండే పక్షులు, జంతువులు ఎంతగానో సంబరపడతాయి. మనుషులైతే కవి కోకిల, గాన కోకిల అని వాళ్ల పేర్లు ముందు నా పేరు చేర్చుకొని ఎంతగానో సంతోషిస్తారు. అంతేకాదు వసంత రుతువు వచ్చిందంటే నేను గొంతెత్తి పాట పాడితే చెట్లు సైతం కొత్త చిగుళ్లతో నా పాటకు తాళం వేస్తున్నట్లుగా ఊగుతూ ఉంటాయి' అని గొప్పగా చెప్పుకుంది దుర్బుద్ధి. 'అవును అయితే మాత్రం' అన్నది మారుతి. 'అంతేకాదు కాకిని ఎప్పుడూ అందరూ తిడుతూనే ఉంటారు. ఇది అరిస్తే ఏంటీ కాకిగోల అని విసుక్కుంటారు. అలాంటప్పుడు ఈ కాకి నాతో సమానం ఎలా అవుతుంది. అందుకే నేనే గొప్పంటాను' అని గర్వంగా అన్నది దుర్బుద్ధి. 'ఓహో! అదా నీ సందేహం నీ గొప్పతనం నీదే. కానీ నేను నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతాను సమాధానం చెబుతావా?' అడిగింది మారుతి. 'ఓ తప్పకుండా చెబుతాను అడుగు అంది'. 'నీ అంతట నీకు గూడు కట్టుకోవడం వచ్చా?' అడిగింది మారుతి. 'రాదు' అంది దుర్బుద్ధి. 'నీ అంతట నువ్వు నీ గుడ్లను పొదిగి పిల్లల్ని చేయగలవా?' అడిగింది మారుతి. 'అమ్మో! ఆ పని నాకు చేతకాదు' అన్నది దుర్బుద్ధి. 'కాకి కష్టపడి కట్టుకున్న గూటిలో నువ్వు నీ గుడ్లు పెడితే వాటిని పొదిగి పిల్లల్ని చేస్తుంది. అంటే పరోక్షంగా నీ పిల్లల్ని నీకు అందించేది కాకి ఆ విషయం నువ్వు గమనిం చావా?' అడిగింది మారుతి. 'అవును గుర్తుంది' చెప్పింది దుర్బుద్ధి. 'అంతేకాదు కాకి కావ్ కావ్ అని అరుస్తుంటే, ఆ అరుపులకి ఎంత అర్థం ఉందో నీకు తెలుసా?' మరలా ప్రశ్నించింది మారుతి. 'తెలీదు' చెప్పింది దుర్బిద్ధి. 'ఈ జీవితంలో మనిషి సంపాదించుకున్న ఆస్తిపాస్తులు ఏవీ శాశ్వతం కావని తెలియజేస్తూ కావు కావు అని అరుస్తూ చక్కని సందేశం ఇస్తుంది' చెప్పింది మారుతి. 'మనుషులు మరణించాక వాళ్లకు పిండం పెడితే కాకిరూపంలో మరణించిన వాళ్లు వచ్చి ఆహారం తింటారని మనుషులు నమ్ముతారు. కాకుల్ని వాళ్ల ఆత్మ బంధువులుగా భావిస్తారు. ఇకనైనా కాకిని చులకనగా చూడడం మానుకో' హితబోధ చేసింది మారుతి. 'కోతి బావ! నా తప్పు నాకు తెలిసి వచ్చింది. ఇకపై నేను ఎవరిని తక్కువ చేసి మాట్లాడను' అని చెప్పింది దుర్బుద్ధి. తరువాత సుబుద్ధివైపు తిరిగి 'మిత్రమా! నన్ను మన్నించు. 'అయ్యో నేస్తమా! నీ తప్పు నువ్వు తెలుసుకున్నావు. మనం మంచి మిత్రులం పదా వెళ్దాం' అంటూ సుబుద్ధితో ఆకాశంలోకి ఎగిరింది.

**- కోరాడ అప్పలరాజు**



వార్త ఆదివారం

## బాలగేయం

### కొత్త ఏడాది



వచ్చింది కొత్త ఏడాది
తెచ్చింది కొత్త వసంతం
కొత్త ఆశయాలు
కొత్త లక్ష్యాలతో
ముందుకే సాగిపోతాం
ఆటపాటలతోపాటు
టీచర్లు చెప్పే పాఠాలను
చక్కగా వింటాం
బుద్ధిగా చదువుతాం
అమ్మానాన్నలను బాధించం
అందరితో స్నేహంగా
ఉంటాం
జగడాలు లేని
స్నేహం మాది
గొడవలు ఏవైనా
మబ్బుల్లా తొలగిపోతాయి
క్షణకాలమే కోపం
జీవితమంతా స్నేహబంధమే
ఈ ఏడాదంతా
ఆదర్శంగా మెలుగుతాం.

**- రూతు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**- సి.వాసుకి,** వరంగల్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జెండాలు, జాతీయ పతాకాలు ఎందుకు కనిపెట్టారు?**

**జవాబు: వాసుకి!** మొట్టమొదటగా జెండాలను సముద్రంలో ప్రయాణించే నావికులు తమ ఉనికిని దూరంగా వున్నవారికి తెలియజేసేందుకు; ఇతరత్రా సమాచారాన్ని అందించే సంకేత చిహ్నాలుగా ఉపయోగించేవారు. ఇక, జాతీయ పతాకాలు ప్రజలకు దేశభక్తిని బోధపరిచి, జాతీయ వాదాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి. ప్రపంచంలో మొట్టమొదటి జాతీయ జెండా క్రీ.శ.1219లో ఎగురవేశారు. మొదటి జాతీయ జెండా డెన్మార్క్ దేశంలో రూపు దిద్దుకున్నది. మన జాతీయ జెండాను 1921, మార్చి 31న కృష్ణా జిల్లా వాసి, శాస్త్ర పరిశోధకులు పింగళి వెంకయ్య రూపొందించారు. దీనికి విజయవాడలో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మహాసభలో తొలిసారిగా రూపకల్పన జరిగింది. మన జాతీయ జెండా త్రివర్ణ పతాకం. అందులోని అశోకచక్రం స్థైర్యం, సౌజన్యం, సంయమానాలకు ప్రతీకగా ఆనాడు భావించారు.

**- ఎం.అంకుశ్,** హైదరాబాద్

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే.వానపడే ముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి?**

**జవాబు: అంకుశ్!** వర్షం పడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి కదా. వీటి మీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వాన పడే ముందు నీటి బిందువుల సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. ఈ దృష్ట్యా, వాన పడేముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.



**కొత్త వత్సరాన నూతన ప్రణాళి కలు, లక్ష్యాలను సిద్ధం చేసుకునే అవకాశం. ప్రస్తుతం మనం అను సరిస్తున్న కాలమానపట్టిక గ్రగేరి యన్ కాల నిర్ణయపట్టిక. నిర్దిష్ట మైన ప్రమాణం లేని పట్టికను సవ రించి క్రీ.శ.1582లో పోప్ గ్రగేరి యన్ రూపొంచిన ఈ కేలండర్ ప్రకారం ప్రపంచమంతా అను స రిస్తూ ఆర్థిక సంవత్సర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా ప్రపంచ మంతా జరుపుకుంటుంది.**



# కొత్త ఆశయాలతో..

డాక్టర్ దేవులపల్లి పద్మజ

దేశానికి వెన్నెముక వంటి యువత ఈ వేడుకలను అట్టహాసంగా జరుపుకుంటారు. మిస్సైల్ మేన్ అబ్దుల్ కలాం యువత నుద్దేశించి.. అందరిలా కాకుండా కొత్తగా ఆలోచిం చండి. ఎవ్వరూ నడవని బాటలో నడవండి..కొత్త విషయాలను కనిపెట్టండి..అసాధ్యం అనుకొంటున్నవి ఛేదించేందుకు, సమస్యలపై విజయం సాధించేందుకు సాహసించండి... ఈ లక్షణాలను అలవరచుకునే దిశగా కదలండి, నవ వత్సరాన ఆన వేసుకో. నిన్ను నువ్వు మార్చుకుని సమాజాన్ని మార్చుకో, నవయుగం కోసం సంకల్పం చేసుకో. నీ గమ్యం తెలుసుకొని, లక్ష్యం సాధించుకున్న, విజయం నీ వెంటే నడిచి నీకు బానిసగును. కొత్త సంవత్సరం వస్తోందంటే కాలగమనంలో మరొక సంవత్సరం వెనక్కి పోయినట్టే. యువత గతం, వర్తమానం కంటే భవిష్యత్‌పై అనంతమైన ఆశలు పెట్టుకుని లక్ష్యాన్ని గమ్యం చేరుకోవాలి. డిసెంబరు నెల చివరిరోజున స్నేహితులతో కలిసి గడిపే క్షణాలకోసం ఎదురు చూడడం కాదు. రేపటి కొత్త వత్సరాల చేయబోయే ప్రయోజనకర కార్యక్రమాలను ప్రణాళిక వేసుకుంటూ గత సంవత్సర వైఫల్యాలను అధిగమించే ప్రయత్నం చేయాలి. యువత స్త్రీ, పురుషులు ఇరువర్గాల వారు ఈ 21 శతాబ్దంలో సమానంగా వ్యసనాలను ప్రోత్సహించుకుంటూ పబ్‌ల వెంట, బార్‌లవెంట కాలక్షేపం చేస్తూ తల్లిదండ్రులను క్షోభకు గురిచేస్తూ, అదే నాగరికత అనుకుంటున్నారు. ఉన్నత విద్య నేర్వడమే కాదు ఆస్థాయి సంస్కారం, బాధ్యత కూడా తెలుసుకోవాలి. భారతదేశ జనాభాలో 70శాతం యువత ఉండడం విశేషం. అయితే వారిలో 40శాతం దుర్వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితం తామే నాశనం చేసుకుంటు న్నారు. 25శాతం విద్యానంతరం ఉత్తమ సంపాదనకొరకు విదేశాలలో ఉద్యోగం ఎంచుకుంటున్నారు. మిగిలిన వారు చదువురాక, చదివించే వారు లేక కూలీ పనులకుపోతూ జీవితం వెళ్లదీస్తున్నారు. ఇందులో నిర్లక్ష్య చోదక చేస్తూ వాహన ప్రమాదాలకు గురి అవుతున్నవారూ ఉంటారు. నూతన సంవత్సరం వస్తోందంటే అనేక తీర్మానాలు చేసుకుంటారు. వ్యక్తిగత నిర్ణయాలు అనేకం. 46శాతం మంది వ్యక్తులు కనీసం ఆరునెలల పాటు ఈ తీర్మానాలు అప్పుడప్పుడు తలుచుకుంటూ ఉంటారు. అమలు చేసిన చేయకపోయినా తపన మాత్రం మదిలో మెదులుతూ ఉంటుంది. 8శాతం మంది సంవత్సరం చివరివరకూ అలాగే జ్ఞప్తిలో ఉంచుకోవ డము, ప్రయత్నం చేద్దాం అనుకుంటూ ఉంటారు. యువతలో కొంతశాతం సమయానుసారం నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. ఫలితం సాధిస్తారు. కర్తవ్య నిర్లక్ష్యధోరణిలో అభివృద్ధి కుంటుపడి వ్యక్తిగత ప్రగతి కూడా సన్నగిల్లుతుందని తెలుసుకోవాలి.

రోజులు మారడం వలన, కాలపట్టిక మారడం వలనో మన జీవితాలలో పెనుమార్పులు జరిగిపోవు. వ్యక్తి దృక్పధం మారితే ప్రగతి సాధిస్తారు.

ఉత్సాహం సాహసం ధైర్యం
బుద్ధిశ్శక్తిః పరాక్రమం!
షడేతే యత్ర తిష్ఠంతి
తత్ర దేవోపి తిష్ఠతి!!



ఉత్సాహంతో సాహసోపేతులై తమ శక్తిని, బుద్ధిని పరాక్రమాన్ని ధైర్యంగా ఎక్కడ ప్రదర్శించగలరో అక్కడ వారికి దైవం కూడా సహాయం చేస్తాడు. మనలో నిద్రాణమైన ఈ ఆరుగుణాలపై

క్రియాశీలత కలిగి ఉండాలి. అసలు ఈ ప్రణాళికపై స్పష్టమైన అవగాహన కలిగి, 'స్వీయ-సమర్థత అనే చాలా ముఖ్యమైన భావనను ఉపయోగించి దానిని అనుసరించడం ద్వారా, నా జీవితంలో జరగబోయే దానిపై నాకు నియంత్రణ ఉంటుంది', అని స్పష్టమైన ప్రకటన చేయడం. యువశక్తి అణుశక్తి కన్నా బలమైనది. జాతి పురోభివృద్ధికి ఇంధనం యువత. యువకులకు దిశనిర్దేశం చేసే యువజన సంక్షేమ మంత్రిత్వశాఖ యువత కోసం రూపొందించిన అనేక ప్రోత్సాహకాలతో రాష్ట్ర యువతలో ప్రతిభను వెలికితీసి సామాజిక ప్రయోజనం సాధించవచ్చు. రాష్ట్రంలో ఉన్న సంఘాలను సంఘటితం చేసి వర్తమాన పరిస్థితులకు తగిన విధమైన ప్రగతి పథ ప్రణాళికాబద్ధ కార్యాచరణ రూపొందించుకోవచ్చు.



నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్ణయించుకున్న నియమాలను, ఫలితాలను తరచుగా సమీక్షించుకోవాలి. ఈమధ్య ఐఐటీ, మద్రాసు విద్యార్థులు వాతావరణంలోని కాలుష్య నియంత్రణ యంత్రాన్ని కనిపెట్టారు. అతితక్కువ వ్యయంతో మద్రాసు నుంచి బెంగళూరు కేవలం అరగంటలో ప్రయాణిస్తూ నగర రహదారుల వెంట నడుస్తూ వాహన కాలుష్యం వంటి వాటిని నియంత్రిస్తుంది. ఇది విద్యుత్ తీగలపై ప్రయాణించే లఘుయంత్రం. ఇటువంటి దేశవ్యాప్త ప్రయోజనకర విషయాలపై



భారతీయ యువత దృష్టి పెట్టి తమ సామర్థ్యం ప్రతిభ పెంపొందించుకోవాలి. సంవత్సర ఆరంభంలో తీసుకున్న నిర్ణయాల పట్టికను కార్యరూపం చేయాలి. స్వామి వివేకానంద యువతను మేల్కొలిపిన వాక్యం సదా స్మరణీయం. 'నా మాటలను నమ్మడానికి సాహసిస్తే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో ఉజ్జ్వలదశ ప్రాప్తిస్తుంది. నాపై నాకుచిన్నప్పుడు ఎట్టి విశ్వాసం ఉండేదో అటువంటి అఖండ విశ్వాసం మీపై మీకు ఉండి తీరాలి. అనంతశక్తి భాండాగారం ప్రతి ఆత్మలోనూ ఉంది. మీరు భారతదేశాన్ని పునర్నిర్మించగలరు' అని తరచుగా మనకి మనం కర్తవ్యం గుర్తు చేసుకుంటూ ఆదర్శంగా ఆదిశగా పనిచేయాలి.

పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుంది. ఒక్క రోజులో దేన్నీ సాధించలేమని' వివేకానంద చెప్పినట్టు నిరంతరం లక్ష్యసాధనకై కృషి చేయాలి. చదువును, ఉద్యోగాన్ని, పరిశోధనని, జీవితాన్ని ఇష్టపడి దానికోసం కష్టపడితే ఫలితం శాశ్వతంగా అనుభవిస్తాం. వ్యక్తిగత నియమాలు సత్యం, ధర్మం, న్యాయం, శరీరంలో ఒక భాగం కావాలి. అవి మన నుంచి వేరుకానంతవరకూ కాలం కూడా అనుకూలంగా వెంటే వస్తుంది. అప్పుడు నిత్యం డిసెంబరు 31 రోజులా ఉత్సాహంగా ఉంటుంది. తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవిస్తూ వారి సూచనలు సలహాలు తీసుకుంటూ ప్రగతి సోపానం చేసుకోవచ్చు. యువత జీవితంలో సాధించాలనుకున్న ప్రగతి సాధించిన తర్వాత గోవాబీచ్‌లో, బ్యాంకాంగ్, మనాలీ వెళ్లి కావలసిన విధంగా స్నేహితుల మధ్య ఆడంబరంగా చేసుకుంటే మధురస్మృతిగా మిగిలిపోతుంది. పాశ్చాత్య సంస్కృతిని అనుకరిస్తూ మనం ఎలా ఉంటున్నది, వారు ఎలా భావిస్తున్నారు ఈ నూతన సంవత్సర వేడుకల గురించి పరిశీలిస్తే..

ఆన్ ది పాస్ ఆఫ్ టైమ్..

వెనీషియన్ రచయిత థామస్ మన్ కాలగమనం గంభీరతను, మానవుని 'గంటలు, నెలలు' ఒక సెకను నుండి మరొక సెకనుకు మారడాన్ని జరుపుకోవడం కోసం, సమయం ఏమీ పట్టించుకోదు. 'సమయానికి దాని మార్గాన్ని గుర్తించడానికి ఎటువంటి విభజనలు లేవు, కొత్తనెల లేదా సంవత్సరం ప్రారంభాన్ని ప్రకటించడానికి ఎప్పుడూ ఉరుము-తుఫాను లేదా బాకాలు మనోగతం లేదు. కొత్త శతాబ్ది ప్రారంభమైనపుడు కూడా, మేం మాత్రమే గంటలు మోగిస్తాం తుపాకులతో కాల్చేవాళ్లం' అని తెలియజేస్తున్నారు. గడచిన కాలంలోని మంచి చెడులను గుణపాఠాలుగా స్వీకరిస్తూ అవరోధాలను అధిగమిస్తూ ఆశయ సాధన చేస్తూ ఆనందంగా గడుపుతూ దేశాభివృద్ధికి తమవంతు బాధ్యత వహిస్తూ లక్ష్యం దిశగా పయనించాలని యువతను కోరుతూ శుభాకాంక్షలు తెలుపుతూ...

❐

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు,

## కార్టూన్లకు ఆహ్వానం

చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

కథ

# తద్దినం

గన్నవరపు నరసింహమూర్తి

ఉదయం తొమ్మిది గంటల వేళ.. రాఘవశాస్త్రి కాళ్లు కాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు. తిరుగుతూనే మాటి మాటికీ వాచీ చూసుకుంటున్నాడు. అలా తిరుగుతుండగానే సమయం పది అయిపోయింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి భార్య సావిత్రిని గట్టిగా పిలిచి "ఏమోయ్! శర్మగారు ఇంకా రాలేదు. 9 గంటలకి రమ్మనమని చెప్పేను కదా! ఈ రోజు మా నాన్నగారి ఆబ్దికం. చుట్టాలందర్నీ పిలిచాం, ఇప్పటికింకా అతనూ, బ్రాహ్మలు రాకపోతే ఎలా చెప్పు?" అని గట్టిగా అన్నాడు.

"అబ్బబ్బా! మీకంతా తొందరేనూ! అరగంట క్రితం ఫోన్ చేస్తే "వచ్చేస్తున్నాను.. ట్రాఫిక్ ఎక్కువగా ఉందని" చెప్పాడు కదా. మీ అమ్మా నాన్నలిద్దరూ చనిపోయిందగ్గర్నుంచీ వాళ్ల తద్దినాలు ఆయనే చేయిస్తున్నాడు. మన ఇంటి పురోహితుడు అతనికి తెలీదా చెప్పండి?" అంది సావిత్రి విసుక్కుంటూ.

"సరే! మా అక్కా, చెల్లెలు, వాళ్ల పిల్లలంతా వచ్చేస్తున్నారు. వంటావిడ కూడా ఆలస్యంగా వచ్చినట్లుంది. వంటలెంతవరకు వచ్చాయి? ఈసారి పనసకాయ కూర బాగా చెయ్యమని చెప్పు. క్రితంసారి పాడు చేసిందని మా అక్కా చెల్లెళ్లు అన్నారు. ఈసారి ఆ మాట రాకూడదు" అని పెరట్లోకి వెళ్లాడు అరిటాకులు కొయ్యడానికి.

రాఘవ కలెక్టరాఫీసులో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నాడు. అతని తండ్రి రమణశాస్త్రి నాలుగేళ్ల కిందట చనిపోయాడు. అంతకు ముందు సంవత్సరం తల్లి పార్వతి కూడా చనిపోయింది. అప్పట్నుంచీ క్రమం తప్పకుండా తోడబుట్టిన వాళ్లను, బంధువులను పిలిచి భక్తిశ్రద్ధలతో ఇద్దరికీ తద్దినాలు పెడుతున్నాడు రాఘవ.

రమణశాస్త్రి, పార్వతి దంపతులకు నలుగురు పిల్లలు. పెద్దవాడు రాఘవశాస్త్రి, రెండవవాడు శంకర శాస్త్రి; తరువాత ఇద్దరు కూతుళ్లు.. జానకి, సుభద్ర. రమణశాస్త్రి తను పుట్టిన కేశవపురం అగ్రహారంలోని పాఠశాలలో 30 ఏళ్లు ఉపాధ్యాయునిగా పని చేసి పదవీ విరమణ చేసాడు.

పిల్లలెక్కువ మంది కావడంతో వాళ్ల చదువులకు, పెళ్లిళ్లకు బాగా ఖర్చైపోవడంతో అతను పెద్దగా సంపాదించలేకపోయాడు. పదవీ విరమణ తరువాత పల్లెలోనే ఉందామనుకున్నా అతని ఆరోగ్యం సహకరించక పోవడం వల్ల జిల్లా పట్నంలో కలెక్టర్ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న పెద్ద కొడుకు రాఘవ శాస్త్రి దగ్గరకు భార్యాభర్తలిద్దరూ వచ్చారు. కానీ పెద్ద కోడలు సావిత్రి గయ్యాళి కావడంతో ఆమె దగ్గర ఆ దంపతులు ఎక్కువ కాలం ఉండలేకపోయారు. రాఘవశాస్త్రి కూడా భార్యా విధేయుడు కావడంతో ఆ విషయంలో ఏమీ చెయ్యలేకపోయాడు. అప్పుడు ఆ దంపతులు రెండో కొడుకు శంకరం దగ్గరికి వెళ్లారు.

శంకరంది చిన్న ఉద్యోగం. ఓ ప్రైవేటు కంపెనీలో చిన్న గుమాస్తా. అతనికిద్దరు పిల్లలు. తనకొస్తున్న చాలీచాలని జీతంతో ఆ కుటుంబాన్ని పోషించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో తల్లిదండ్రులు కూడా అన్నయ్య ఇంట్లో ఉండలేక అతనింటికి రావడంతో అతని ఇబ్బందులు మరింత పెరిగాయి.

రమణశాస్త్రికి వస్తున్న పింఛను భార్యా భర్తల మందులకే సరిపోయేది కాదు; అయినాసరే శంకరం ఎంతో ప్రేమతో, బాధ్యతతో తల్లిదండ్రులను వాళ్ల చనిపోయేదాకా ఇంట్లో ఉంచుకొని పోషించాడు. దానికి కారణం అతని భార్య సుమతి. ఆమె చాలా మంచిది. అత్తమామలిద్దర్నీ తల్లిదండ్రుల్లా భావించి సేవ చేసింది.

సుమతి పార్వతి తమ్ముడు కామేశం కూతురు, అతను పురోహితుడు. తన కూడురు సుమతిని రెండవ కోడలిగా చేసుకొమ్మని కామేశం ఇంటికొచ్చి అక్క పార్వతిని అడిగినప్పుడు పురోహితుని కూతుర్ని కోడలిగా చేసుకోవడానికి ఆమె ఇష్టపడలేదు. కానీ శంకరం తల్లికి సర్దిచెప్పి సుమతిని పెళ్లి చేసుకున్నాడు. కోడలిగా చేసుకోవడానికి నిరాకరించిన ఆ మేనకోడలు సుమతే తమను వానప్రస్థంలో ఆదరించి సేవ చేస్తున్నందుకు ఆ దంపతులిద్దరూ ఎప్పుడూ కోడల్ని పొగుడుతుండేవారు.

వాళ్లు బతికున్నంత కాలం పెద్ద కొడుకు రాఘవ, సావిత్రి అదే పట్నంలో ఉంటున్నా వాళ్లని చూడటానికి కూడా ఎప్పుడూ వచ్చేవారు కాదు.

ఒకవేళ వెళితే అత్తా మామల్ని ఎక్కడ తమింటికి తీసికెళ్లమంటారోనని సావిత్రి భయం. రాఘవకి చుట్టుపక్కలవాళ్లు, బంధువులు తాను తల్లిదండ్రులను చూడటంలేదని తనని ఆడిపోసుకుంటారన్న బెంగ లోపల ఉన్నా- భార్యకూ, పిల్లలకు భయపడి నోరెత్తేవాడు కాదు. అతని ఇద్దరి పిల్లలకు తాతా, మామ్మలంటే ఇష్టం ఉండదు; అందుకే ఎప్పుడైనా రాఘవ ఆ మాటలంటే వాళ్లు అతని మీద నోరు పారేసుకుంటారు.



**"శర్మగారూ! ఎలా జరిగింది ఆబ్దికం? బాగా జరిపించానా? లేదా? నా తల్లిదండ్రుల ఆబ్దికాలకు ఎంత ఖర్చయినా వెనుకాడను. వాళ్ల కార్యాలను బాగా చేస్తేనే వాళ్లు పై నుంచి నన్ను, నా కుటుంబాన్ని ఆశీర్వదిస్తారు" అన్నాడు రాఘవ.**

తాను ఎన్ని ఇబ్బందులు పడ్డా శంకరం మాత్రం తల్లిదండ్రులను ప్రేమగా చూసుకున్నాడు. ఆ తృప్తితోనే నాలుగేళ్ల క్రితం ఆరు నెలల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ కన్ను మూసారు.

బతికున్నప్పుడు పెద్దగా చూడకపోయినా వాళ్లు చనిపోయిన తరువాత సంవత్సరానికొకసారి వచ్చే వాళ్ల వార్షిక ఆబ్దికాలను రాఘవ తోడబుట్టినవాళ్లను, చుట్టాలను పిలిచి ఘనంగా చేసేవాడు; వచ్చినవాళ్లు ఆ దంపతులిద్దర్ని తల్లిదండ్రుల ఆబ్దికాలను ఘనంగా పెడుతున్నందుకు పొగుడుతుంటే ఆ దంపతులిద్దరూ ఎంతో గర్వపడేవారు.

అలా ప్రతి సంవత్సరం వాళ్ల ఆబ్దికాలను ఘనంగా నిర్వహించడం ఒక రివాజుగా మారిపోయింది రాఘవకి. శంకరం మాత్రం తల్లిదండ్రుల ఆబ్దికాలను తనింట్లోనే ఇద్దరు బ్రాహ్మణులను పిలిచి పూజారి చేత సామాన్యంగా జరిపేవాడు.

.................

పదిన్నర ప్రాంతంలో పూజారి రామశర్మ వచ్చి తద్దినం క్రతువుని మొదలు పెట్టాడు.

అతని వెనకాలే బ్రాహ్మలిద్దరూ వచ్చి స్నానాలు చేసి మడిపంచెలు కట్టుకున్నారు. రామశర్మ ముందుగా కర్రపేళ్ల మీద నెయ్యి పోయిస్తూ అగ్నిహోమం మొదలుపెట్టాడు. ఆ తరువాత రాఘవ చేత బ్రాహ్మలిద్దరికీ కాళ్లు కడిగించి చనిపోయిన తండ్రి, తాత, ముత్తాతల పేర్లు చదువుతూ మంత్రాలతో క్రతువుని పూర్తి చేసాడు.

ఆ తరువాత ఆ ముగ్గురి పిండాలకు ఉదకాన్ని ధారపోసి, కాకికి పిండం పెట్టి, బ్రాహ్మణులకు భోజనాలు వడ్డించారు. తండ్రి మీద భక్తితో రాఘవ బ్రాహ్మణులకు నాలుగు కూరలు, పచ్చళ్లు, బంగినపల్లి మామిడిపళ్లు, అరటిపళ్లు, నెయ్యి, తేనెలతో సుష్టుగా భోజనం పెట్టాడు.

బ్రాహ్మణులు తండ్రి రూపంలో తద్దినంనాడు వస్తారని పురాణాలు ఘోషిస్తుండటం వాళ్లిద్దరికీ తాంబూలంలో అరటిపళ్లు, వెయ్యి రూపాయలు పెట్టి కాళ్లకు నమస్కరించాడు.

ఆ తరువాత అక్కాచెల్లెళ్లు, చుట్టాలు, పిల్లలు, రామశర్మతో కలిసి భోజనం చేసాడు రాఘవ. ఇవన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం మూడు గంటలైంది.

కాకి వచ్చి పిండాన్ని పట్టుకెళ్లగానే సావిత్రి రాఘవతో "మనం ఎంతో భక్తిగా కార్యాన్ని చేసాం కాబట్టే మీ నాన్నగారు ఆనందంగా పిండాన్ని కాకి రూపంలో వచ్చి పట్టుకెళ్లిపోయారు" అంది. భోజనాల అనంతరం రాఘవ రామశర్మకి తాంబూలంలో రెండు వేల రూపాయలు, అరటిపండ్లు పెట్టి కాళ్లకు దండం పెట్టేడు.

అతను రాఘవని మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు.

ఆ తరువాత అతను వెళ్లిపోతున్న సమయంలో రాఘవ వచ్చి "శర్మగారూ! ఎలా జరిగింది ఆబ్దికం? బాగా జరిపించానా? లేదా? నా తల్లిదండ్రుల ఆబ్దికాలకు ఎంత ఖర్చయినా వెనుకాడను. వాళ్ల కార్యాలను బాగా చేస్తేనే వాళ్లు పై నుంచి నన్ను, నా కుటుంబాన్ని ఆశీర్వదిస్తారు. మా ఆఫీసులోను, మా చుట్టుపక్కలవాళ్లు నేను మా తల్లిదండ్రుల ఆబ్దికాలను ఎంతో గొప్పగా పెడతానని అంటూ ఉంటారు. ఒక కొడుకుగా నాకంతకన్నా ఏం కావాలి చెప్పండి? అదే మా తమ్ముడు శంకరం చూడండి.. ఏదో పెట్టాలని ఆబ్దికాలను పెడతాడు తప్ప అక్కాచెల్లెళ్లతో సహా ఎవరినీ పిలవడు. తక్కువ ఖర్చుతో మమ అనీ అనిపించేస్తాడు. నాకలా ఇష్టం ఉండదు" అన్నాడు గర్వం, అహంకారం నిండిన స్వరంతో.

అతని మాటలకు రామశర్మ మౌనం దాల్చేడు. అతని ముఖంలో రంగులు మారటాన్ని గమనించాడు రాఘవ.

కొద్దిసేపటికి రామశర్మ మౌనం వీడి "రాఘవగారూ! నేను ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. బతికున్నప్పుడు తల్లిదండ్రులను చూడకుండా వాళ్లు చనిపోయిన తరువాత వాళ్ల కర్మకాండలకు, ఆబ్దికాలకు లక్షలు ఖర్చు పెట్టి ఏం లాభం చెప్పండి? 'అపుత్రస్య గతిర్నాస్తి' అన్నారు పెద్దలు. పుత్రులు పున్నామ నరకాన్ని తప్పిస్తారని వేదాలు చెబుతున్నాయి. కానీ బతికున్నప్పుడు వాళ్లకు తిండి పెట్టకుండా, సేవ చెయ్యకుండా ఉండేవాళ్లు కొడుకులు కారు; 'ఆత్మనాం పుత్ర నామాసి' అంటారు.

తండ్రి ఆత్మ పుత్రుడు రూపంలో వస్తుంది అంటారు; అలాగే 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి' అన్నారు. కన్నతల్లి స్వర్గం కన్నా గొప్ప. అటువంటి మిమ్మల్ని కన్న తల్లిదండ్రులను బతికున్నప్పుడు మీరు సరిగ్గా చూడలేదు, సాకలేదు. భార్యా విధేయులై వాళ్లను గాలికొదిలేసారు.

కానీ మీ తమ్ముడు తనకు మీకున్నంత ఆదాయం లేకున్నా తల్లిదండ్రులను కళ్లల్లో పెట్టుకొని పూజించాడు. శ్రవణ కుమారుడిలా సపర్యలు చేసాడు. అతని భార్య మహాసాధ్విలా వాళ్లకు సేవ చేసి గొప్ప కోడలనిపించుకుంది. బతికున్నప్పుడు తల్లిదండ్రులను ఆదరించక, తిండి పెట్టకుండా బాధలు పెట్టి, చనిపోయిన తరువాత వాళ్ల కోసం లక్షలు ఖర్చుపెడితే ఆ తల్లిదండ్రుల ఆత్మలు సంతోషించవు సరికదా ఘోషిస్తాయి, ఉస్సురుమంటాయి.

తల్లిదండ్రులను ఆదరించటం అన్నది పిల్లల విధి. మనం మన తల్లిదండ్రులను ఆదరించకపోతే రేప్పొద్దున మన గతి కూడా అంతే అవుతుంది. మీ ముందు పొగుడుతున్న వాళ్లందరికీ మీరు మీ తల్లిదండ్రుల పట్ల ఎలా ప్రవర్తించారో బాగా తెలుసు. ముఖస్తుతి కోసం పొగుడుతుంటే మీరు మురిసిపోతున్నారు. కానీ మీరేం చేస్తున్నారో మీ అంతరాత్మకు తెలియదా చెప్పండి? నేనిలా అన్నందుకు దయచేసి నన్ను తప్పుగా అనుకోవద్దు. మీ పెద్దలే నా రూపంలో వచ్చి ఈ మాటలు అనిపించారనుకోండి" అని చెప్పి వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయినా రాఘవ, అతని మాటలను లోపల్నించి వింటున్న సావిత్రి కొద్దిసేపటివరకు మనుషులు కాలేకపోయారు. వాళ్ల కళ్లల్లో తెలియకుండా నీళ్లు ధారాపాతంగా వర్షించడం మొదలైంది. ✦

# మీ జీవితానికి మీరే నిర్ణేతలు

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

'పరమ సౌఖ్యమె నీవుపోరన్నా, దుఃఖమెన్నడు లేశమయినను నీకు లేదన్నా, మనసు చేతను దుఃఖమేర్పడు' అన్నారొక మహానుభావుడు. ఈ జీవితం భగవంతుడిచ్చిన వరం. మనిషి ఎందుకు ఆనందంగా వుండటం లేదన్న విషయాన్ని గమనిస్తే మనుషులలో అత్యధిక శాతం స్వార్థపరులు కావడమేనని చెప్పాల్సి వుంటుంది.

'నేను, నాది' అంటూ జపిస్తూ, తపిస్తూ, విపరీతంగా ధనం కూడబెట్టాలనుకోవడమే కారణం. ఆస్తులు సంపాదించడం, విచ్చలవిడిగా జీవించేందుకు ఎలాగైనా సంపాదించడం,



ధ్యేయంగా మనిషి సాగుతున్నంత కాలం అతనికి మనశ్శాంతి లభించడం కల్ల. ఈ వెంపర్లాటలో ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది న్యాయం, ఏది అన్యాయం అన్న మాటే మరిచి ముందుకు సాగుతున్నారు. వీరి స్వార్థం ఎంతవరకు వెళ్లిందంటే, సంపాదించిన దాంట్లో ఆ భగవంతునికి కూడా వాటా ఇస్తానంటూ బేరమాడుతున్నాడు. మానవుడి స్వభావం ఎంతో విచిత్రంగా మారుతోంది. నానాటికీ మనిషి కోర్కెలు విపరీత ధోరణుల్లో సాగుతున్నాయి. ఇతరులతో పోల్చుకోవడం, అసూయతో కాగిపోవడం సర్వసాధారణమైపోయింది. ఆశ వుండొచ్చు. దురాశ, పేరాశ మాత్రం కూడదు. ధనం పోగు కాగానే మనిషిలో అహంకారం చోటు చేసుకుంటున్నది. అయినవారిని కానివారుగా చేసుకుంటున్నాడు. ఆత్మీయులను దూరం చేసుకుంటున్నాడు. విరోధాలు పెరిగిపోయి, చివరకు ఒంటరివాడైపోతున్నాడు. సంకుచితంగా ఆలోచించడం మొదలు పెడుతున్నాడు. దాంతో ఒకటి తర్వాత మరొకటిగా తప్పులు చేస్తూ వున్నాడు. తప్పులు చేస్తే తప్పవు కదా తిప్పలు అన్నట్లుగా, అష్టకష్టాల్లోకి నెట్టబడుతున్నాడు. ఈ సమస్యలన్నింటికీ కారణం అంతులేని వింత కోరికలేనని చెప్పాలి. మనస్సే కోరికలకు నిలయం కదా! ఎవరైతే ధర్మ మార్గాన్ని తప్పుతారో వారికి శత్రువులు పుట్టుకొస్తారు. వారికి ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించడమే అందుక్కారణం. అసూయా ద్వేషాలు పెరిగిపోతాయి. తద్వారా వారికి మిగిలేది దుఃఖమే. ఎవరైతే మంచిగా మాట్లాడతారో, మంచిగా ప్రవర్తిస్తారో, అందరి మంచినీ వాంఛిస్తారో, కోపాన్ని నిగ్రహించుకోగలుగుతారో వారు సమస్యల నుండి విడివడి, దుఃఖాల నుండి విముక్తులు కాగలుగుతారు. అధర్మానికి ఆయుష్షు తక్కువ. సత్యమే ఎప్పుడూ శాశ్వతంగా నిలుస్తుంది. ఈ లోకంలో సత్ప్రవర్తన కలిగినవారి జీవితాలు సఫలమవుతాయి. జీవిత పరమార్థం ఏమిటో తెల్సుకోవాల్సి వుంది.

మానవుడిలో ప్రకృతిని గౌరవించి, కాపాడుకునే తత్త్వం లోపిస్తుంది. ఎంతటి క్రమశిక్షణతో నిత్యం పంచభూతాలూ మనలను కాపాడుతున్నాయో గమనించడం లేదు. సూర్యభగవానుడు నియమం తప్పకుండా సరిగ్గా ఉదయిస్తున్నాడు. నియమం తప్పకుండా అస్తమిస్తున్నాడు. చంద్రుడు, నక్షత్రాలూ నియమాల ప్రకారం సరిగ్గా గమనం సల్పుతూ వున్నాయి. వసంత కాలం రాగానే చెట్లు చిగురిస్తూ వున్నాయి. ఏయే ఋతువులందు వాతావరణం ఎలా వుండాలో ఆ విధంగా భగవాన్ వాటి కార్యాలను జరుపుతూనే వున్నాడు. ప్రకృతి నియమబద్ధంగా వర్తిస్తూనే వుంది. మీరు గమనించారో లేదో.. పశు పక్ష్యాదులు ప్రకృతితో తమ జీవితాలను ముడిపెట్టుకొని జీవితాంతం వాటితోనే జీవిస్తాయి. అవి పుట్టినప్పుడు ఎలా వుంటాయో, చనిపోయినప్పుడు కూడా అలాగే వుంటాయి. సింహం క్రూరంగా ఉంటుంది. అది జీవితాంతం అలాగే వుండి, చనిపోయినప్పుడు కూడా అలాగే ఉంటుంది. దానిలో ఎలాంటి మార్పూ వుండదు. ఇక మానవుని విషయానికి వస్తే అలా కాదు. మనిషికి బుద్ధిని ప్రసాదించాడు. జ్ఞానం కలిగి వున్నాడు. మానవుడు తనకు కావల్సిన విధంగా తన జీవనాన్ని సాగించగలడు. ఎనభై లక్షల నాలుగు లక్షల జీవరాసుల్లో మానవునికి ప్రత్యేకత వుంది. అతను సంస్కారంతో జీవించగలడు. మానవుడు మాధవుడిగా మారగలడు.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

# 'కవిభూషణ' ఆచార్య దివాకర్ల వేంకటావధాని

జయసూర్య

తెలుగు సాహితీయానంలో అధ్యయన, అధ్యాపక సాధికారిక ప్రజ్ఞా సాహితీవేత్తగా, ఆచార్య దివాకర్ల వేంకటావధాని జగమెరిగిన మహా పండితులు. విద్వత్తు, ధారణ, పాండితీ ధోరణిలో అచ్చమైన తెలుగుదనం రూపు కట్టిన ఆచార్యునిగా ఆదర్శనీయ వ్యక్తిత్వంతో అవధాని శబ్దాన్ని సార్థకం చేసుకొన్న విద్యా విశారదుడు. 1934లో విశాఖపట్నంలో తెలుగు పండితునిగా తొలి దశ నుంచి దివాకర్లవారు, అధ్యయన, అధ్యాపక, ప్రతిభా సంపన్నునిగా ఆంధ్ర, ఉస్మానియా విశ్వవిద్యాలయాలలో తెలుగు భాషా బోధన విద్యా రంజకంగా కొనసాగించారు. ఉస్మానియాలో 27 సంవత్సరాలు ఉపన్యాసకునిగా, రీడర్, ఆచార్య, శాఖాధ్యక్ష, డీన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తించిన దివాకర్ల ఎందరికో ఆదర్శనీయంగా ఎన్నో దివ్వెలు వెలిగించి తెలుగు సాహితీ వెలుగులు ప్రసరింపచేసారు. ఉపన్యాసాల రూపేణా పండితులకే కాదు పామరులకు కూడా తెలుగు సాహిత్యంలోని మాధుర్యాన్ని కళాత్మక ప్రతిభా సమన్వితంగా చాటి చెప్పి, సాహితీ సరస్వతిని ఆరాధించారు.




'ఆంధ్ర వాఙ్మయారంభ దశ నన్నయ భారతం' అనే అంశం మీద 1957లో పిహెచ్‌డి పొందిన దివాకర్ల, తన సిద్ధాంత వ్యాసంలో ప్రాఙ్నన్నయ యుగం, నన్నయ భారతం రెండు సంపుటాలుగా ఎన్నో అమూల్య అంశాలు వెలుగులోకి తెచ్చారు. ఆదికవి నన్నయ అంటే ఆయనకు ఆరాధనాభిమానాలుండేవి. ఆచార్య దివాకర్ల వ్యాసం, ఉపన్యాసం రెండు నేత్రాలుగా ప్రాచీన కవుల కావ్య మాధుర్యాన్ని, శిల్ప నైపుణ్యాన్ని పరిశోధనాత్మకంగా అధ్యాపక ఆదర్శంతో ఎందరికో మార్గదర్శకులయ్యారు. **"చెట్టంత పెరిగిన గురువర్యులు, విద్యాసార ఫలభార వినమ్రతరులు. కొండంత ఎదిగిన బుద్ధిబాహు విక్రమం. కొండిక శిశువుల గుండె అద్దాలలో సైతం ఒదిగిపోగలిగిన సుహృన్మణులు"** అని దివాకర్ల వారికి ఎమ్.ఎ.లో శిష్యుడైన డా॥ సినారె పేర్కొన్నారు.

డా॥ దివాకర్ల మొట్టమొదట పద్యరచనతో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. అవధానాలలో ఆశువుగా, అద్భుత ధారణాశక్తి అనర్గళంగా ప్రదర్శించగలిగేవారు.

రాజ సందర్శనం, మధువనం, కవి పరాజయం, త్రిశంతి ఎన్నో పద్యకృతులు రచించారు. బాణుడు సంస్కృతంలో రచించిన హర్షచరిత్ర ఇతివృత్తంగా రాజ సందర్శనం అనువాద కావ్య రూపంలో వచ్చిన పద్య రచన. నిష్ఠాగరిష్ఠునిగా, నిత్య దేవతార్చనతో, భక్తి తత్పరతతో ఋషిదీక్షతో తన రచనా వ్యాసంగాన్ని ఆధ్యాత్మిక ప్రచారానికి, భాషాభివృద్ధికి వినియోగించారు. 1912 జూన్ 23న జన్మించిన డా॥ దివాకర్ల, 1986 అక్టోబరు 21న స్వర్గస్థులయ్యారు.

కళాప్రపూర్ణ దివాకర్ల, యువభారతికి ఎందరో కవులను గురించి వ్యాసాలు, గ్రంథాలు, ఉపన్యాసాలు యిచ్చి ఆంధ్ర భాషా చరిత్రకు సర్వ విధాలా ప్రామాణికతను ప్రసాదించారు. నన్నయను **"ఆచార్యంతం కవీంద్రాణాం వందే వాగమ శాసనమ్"** అంటూ "నన్నయ భట్టారకుడు" గ్రంథంలో ప్రస్తావించారు దివాకర్ల వేంకటావధాని.

1924 విద్యార్థి దశ నుండి వివిధ సందర్భాలలో పత్రికలకు, సంకలనాలకు, సంచికలకు, ఉపన్యాసాలకు సాహిత్య, భాష, సాంఘిక, సాంస్కృతిక విభిన్న అంశాలపై 646 వ్యాసాలు రాసారు. కావ్య గ్రంథాల ప్రాంగణంలో ప్రవేశించడానికి కవాటాలైన పీఠికలు, తొలి పలుకులు 226, హైందవ సంస్కృతిని వేద ధర్మ పునరుజ్జీవానికి, ప్రాచీన సాహిత్యంపై ప్రజాభిమానం పెంపొందింపచేయడానికి అనితర సాధ్యంగా ఉపన్యాసాలు, రచనలు, సంస్కృత వ్యాకరణ సంగ్రహం, ఉదాహరణ కావ్య లక్షణాలతో విశాలాంధ్రోదాహరణం, గేయ సుందరకాండ, అనువాద నాటకాలు ఎన్నో రచించారు. ఛందోబద్ధమైన శరన్మేఘం, శరద్రాత్రి వంటి పద్య కవితలెన్నో ప్రచురింపచేసారు.

అవధానాలు, భారతావతరణం, కనకాభిషేకం, ఇందిరా మందిరం వంటి సాహిత్య రూపకాలు, భువన విజయం ప్రదర్శనలలో సరస సంభాషణలు, సాహిత్య సంగీత సమ్మేళనంగా కృష్ణరాయల కొలువు కళ్లకు కట్టించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. రసవత్తరమైన పద్యపఠనాలు, హాస్య, చమత్కార సంభాషణా చాతుర్యం, సమస్యా పూరణలు ఆంధ్ర సాహిత్యంలో అపురూపమైన అరుదైన రాయలనాటి సాహితీ ప్రబంధ ప్రాముఖ్యతను ప్రదర్శింపచేసే భువన విజయ సాహితీ రూపకం తొలిగా డా॥ దివాకర్ల రూపొందించారు. ఆచార్య దివాకర్ల వేంకటావధాని తెలుగు సాహిత్యాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులో వుండే ప్రక్రియలు సమాజంలో ప్రచారం చేయడానికి రచనలే కాకుండా ఉపన్యాసాలు, రూపకాలు శక్తివంతమైన సాధనాలుగా చేపట్టారు. తరగతి గదులలో బోధించే సాహిత్యం, కేవలం కొందరు విద్యార్థులకు కవి, పండితులకే కాకుండా సమాజంలో కూడా ఆధ్యాత్మిక, సాహితీ చైతన్య దీప్తి ప్రసరింపచేసే బాధ్యత చేపట్టారు. అదే లక్ష్యంతో చివరి శ్వాస వరకు తమ సాహిత్య రూపకాలను ఒక ఉద్యమంగా కొనసాగించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి విశ్రాంతి పొందిన తరువాత తన జీవిత కాలాన్ని రచనా వ్యాసంగం, వేద ప్రచారం, తెలుగు సంస్కృత భాషా చైతన్య సాధనకు వినియోగించారు. 'కవిభూషణ', 'కళాప్రపూర్ణ', 'విద్యాసనాథ' వంటి బిరుదులు వరించాయి. ఎపి సాహిత్య అకాడమీ, ఆంధ్ర సారస్వత పరిషత్, నవ్యసాహితి, యువభారతి, సంస్కృత భాషా ప్రచార సమితి, తెలుగు అకాడమీ వంటి ప్రముఖ సంస్థల పురోభివృద్ధికి, డాక్టర్ దివాకర్ల వేంకటావధాని అమూల్య సేవలు అందించారు. అగ్రశ్రేణి సాహితీ చరిత్ర నిర్మాతగా, మహోపన్యాస కళాప్రపూర్ణునిగా డా॥ దివాకర్ల తెలుగు జాతిని, సాహిత్యాన్ని పులకింపచేసిన ధన్యాత్ములు.

# సర్దుకుపోతే సంతోషం

యామిజాల జగదీశ్

"ఓ ఆఫీసులో పని చేస్తున్న ఒక ఉద్యోగి ఓ పది రోజులు లీవు పెట్టేస్తే ఎలా ఉంటుంది?" అనుకున్నాడు. ఆ విషయాన్నే పక్కనున్న మిత్రుడికి చెప్పాడు. "ఎందుకు" అని అడిగాడు మిత్రుడు.

"నా పై అధికారి కోపిష్టి. ఆయన దగ్గర పని చేయడం శ్రమతో కూడుకున్నది మిత్రమా!" అన్నాడు.

ఆఫీసులో పని చేస్తున్న వారందరూ ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలి. పై అధికారి అంటే అతనేమీ దేవుడు కాదు. ఆయన ఎక్కడి నుంచో భువికి దిగిరాలేదు. అతను మహాత్ముడేమీ కాదు. ఆయన కూడా మనలాగే ఓ సాధారణ మనిషే. ఆయనకూ కొంత బలమూ, బలహీనతలూ ఉంటాయి. కనుక వాటిని చూసీ చూడనట్టు, పట్టీ పట్టించుకోనట్టు ముందుకు సాగిపోవాలి. లేకుంటే క్షణం కూడా పని చేయలేం. పై అధికారులలో పలు రకాల వాళ్లుంటారు. వారిలో ముఖ్యంగా మూడు రకాలు. వీరిలో ఒకరెలాంటి వారంటే- తన కింద పని చేస్తున్న వారిని ఓ యంత్రంలా భావిస్తారు. వీరెలాంటి వారంటే ఎక్కడికైనా క్యాంపుకి వెళ్లినా సరే అక్కడి నుంచి ఫోన్ చేస్తూ ఉంటారు. ఆ పనైందా, ఈ పనైందా? అని అడుగుతుంటారు. ఇటువంటి వారికి సిబ్బంది యోగక్షేమాల గురించో లేక వారి కుటుంబం గురించో అక్కర ఉండదు. ఇటువంటివారు తన కింది సిబ్బంది ఏదైనా సూచిస్తే వారది పట్టించుకోరు. ముందు నీకిచ్చిన పని కానివ్వు, నువ్వు నాకు సూచనలేమీ చేయక్కర్లేదు అంటారు. ఇటువంటి వారిని ఎలా అనుసరించేందుకు ఉన్న ఏకైక మార్గం.. వారేం చెప్పినా "సరే సార్" అని చెప్తూ మన పని కానిచ్చుకోవాలి. అంతేతప్ప మరేదీ అడగకూడదు.

అవునండీ, అవును సార్.. అని చెప్పడం వల్ల మనల్ని మనం తగ్గించుకున్నట్లు కాదు. అది ఆఫీసులో సర్దుకుపోయేందుకు ఒక మార్గం.

ఇంకొందరుంటారు.. వారెలాగంటే.. వీరు ఆఫీసు పని గురించి అంతగా పట్టించుకోరు. తమ సొంత ఇమేజుకి విఘాతం కలగకుండా చూసుకుంటారు. మరేదీ పెద్దగా పట్టించుకోరు. వీరు తరచూ మన బాగోగుల గురించి అడుగుతుంటారు. అలాగే వారు మనం కూడా వారి గురించి ఆలోచిస్తున్నామా లేదా అని ఆశిస్తారు.

ఇటువంటి అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు పంపవచ్చు. వారికి ఎప్పుడైనా అలాగే పుట్టినరోజు శుభాకాంక్షలు పంపవచ్చు. వారికి ఎక్కడైనా సన్మాన కార్యక్రమం జరిగితే ఆ కార్యక్రమ హాల్లో వారికి కనిపించేలా ముందు వరుసలో



కూర్చోవాలి. ఆఫీసు పని మాత్రమే చేసే సిబ్బంది ఇటువంటి అధికారుల దగ్గర మంచి పేరు పొందలేరు. ఇంకొక రకం అధికారం సంగతి చూద్దాం:

వారు ఆఫీసు పని గురించి పట్టించుకోరు. వారు తమ కింద పని చేసే సిబ్బంది గురించి కూడా పట్టించుకోరు. ఏ కారణంగానైనా సరే.. తమ హోదాకు ఆటంకం కలుగకుండా ఉంటే చాలనుకుంటారు. ఇటువంటివారు కఠినంగా పని చేయనూలేరు. ఓ నిర్ణయానికి రానూ రారు. ఏదైనా నిర్ణయం తీసుకోవలసి ఉన్నా దానిని వాయిదా వేస్తూ ఉంటారు. ఇటువంటి వారి వల్ల వారి కింద పని చేసే సిబ్బంది మీద ఎక్కువ భారం పడుతుంది.

ఇటువంటి అధికారుల వద్ద సమస్యను మాత్రం చెప్పడం వల్ల ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. కనుక మీ సమస్యకు మీరే పరిష్కారం కూడా చూసుకోవాలి. మీరే ఆ పరిష్కార మార్గాన్ని చెప్పవచ్చు. అప్పుడే అటువంటి అధికారుల నుంచి మంచిపేరు సంపాదించవచ్చు. అలా కాకుంటే కనీసం చెడ్డ పేరు రాకుండా జాగ్రత్త పడొచ్చు. ఆఫీసులో పని చేసేవారు ముఖ్యంగా కొన్ని విషయాలు జ్ఞాపకం ఉంచుకోవాలి.

ఆఫీసులో జరిగే మంచీ-చెడులు ఏవైనా సరే వెంటనే పై అధికారి దృష్టికి తీసుకుపోవడం మంచిది. అంతేతప్ప మూడో వ్యక్తి ద్వారా ఆ సమస్య అధికారికి తెలియడం సరికాదు.

ఏ అధికారి కూడా తనను దాటి సిబ్బంది ముందుకు పోవడాన్ని భరించలేరు. కనుక ఆయనకు తెలియకుండా పై శాఖకు ఏదీ రాయకూడదు. మీరూ, అధికారీ దాదాపుగా ఒకేలాంటి చదువు చదివి ఉన్నా సర్దుకుపోవడం అనేది ఒకింత ఇబ్బందే. దీనిని మనసులో ఉంచుకుని ప్రవర్తించడం మంచిది. మీకూ, ఆయనకూ అభిప్రాయ భేదమా.. అది ఆయనకూ మీకూ మధ్య ఉన్న సమస్య. దానిని నలుగురికి తెలిసేటట్లు చెప్పుకుంటూ ఉండకూడదు. అది అధికారికి కోపం తెప్పించవచ్చు. మీ పై అధికారి మీతో కలిసి చదువుకున్నవారై ఉండొచ్చు. అలాగని అందరి ముందూ ఆయనను 'ఒరేయ్' అని పేరు పెట్టి పిలవడం సరికాదు. ఎందుకంటే ఆ అధికారికి అలాంటివి నచ్చకపోవచ్చు. ఇటువంటి విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుని నడచుకోవాలి. అప్పుడు పని సాఫీగా జరిగిపోతుంది.

ఓ అధికారి తన కింద పని చేసే సిబ్బంది గురించి చెప్తూ "మా ఆఫీసులో ఎంతో మంది పని చేస్తున్నారు.అందరూ రోజూ వచ్చి ఏదో ఒక సమస్య చెప్పుకుంటూ ఉంటారు. కానీ ఒకతను మాత్రం ఇప్పటివరకూ తన దగ్గరకొచ్చి ఏ సమస్యా చెప్పుకోలేదు. అతను వస్తాడు.. పని చేసుకుంటూ పోతాడు" అని చెప్పాడా అధికారి. నేను వెంటనే ఆ సిబ్బందిని కలిసి అడిగాను "నీ పై అధికారి దృష్టికి ఏ సమస్య గురించి కూడా చెప్పనే చెప్పవుగా!" అని.

"అవును.. ఎందుకంటే ఆయన ఏ సమస్యనూ పరిష్కరించడని నాకు బాగా తెలుసు. అందుకే నేనేదీ చెప్పను. దాని వల్ల ఏ ప్రయోజనమూ లేదు" అన్నాడా ఉద్యోగి నెమ్మదిగా. ✦

# అందాల ద్వీపం-అద్భుత పర్వతాలు

షేక్ అబ్దుల్ హాకీం జాని



**ప్రపంచంలో** అందాల ద్వీపాలు, అద్భుత పర్వతాలు ఎన్నో ఉన్నాయి. అటువంటి ద్వీపాలలో గ్రీన్‌లాండ్; పర్వతాలలో ఆండీస్, విట్నీ చెప్పకోదగినవి.

## గ్రీన్‌లాండ్

ప్రపంచంలోనే అతి పెద్ద ద్వీపంగా భాషిల్లుతోంది గ్రీన్‌లాండ్. ఇక్కడ వంద కంటే ఎక్కువగా అతి చిన్న ద్వీపాలు ఉన్నాయి. ఇది ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, ఆర్కిటిక్ మహాసముద్రం, కెనెడియన్ ద్వీప సమూహానికి ఈశాన్యంలో, ఐస్‌లాండ్‌కు వాయువ్యంగా ఉంది. ఇక్కడి భూభాగం 85 శాతం మంచుతో కప్పి ఉంటుంది. డెన్మార్క్ సామ్రాజ్యపు భాగస్వామ్య దేశం. 1979లో డెన్మార్క్ స్వాతంత్ర్యాన్ని ప్రసాదించింది. భౌగోళికంగా ఉత్తర అమెరికా ఖండంలో భాగంగా ఉన్నప్పటికీ రాజకీయంగా, సాంస్కృతికంగా ఐరోపా ఖండంలోని వందలాది దీవులతో అనుబంధంగా ఉంటుంది. ప్రధానంగా ఈ ప్రాంతంలో సంఖ్యా పరంగా ఆధిక్యతలో ఉన్న 'ఇన్యూట్' ప్రజలు 13వ శతాబ్దంలో కెనెడియన్ ప్రధాన భూభాగం నుండి ఇక్కడకు వలస వచ్చి ద్వీపమంతటా విస్తరించారు. గ్రీన్‌లాండ్ నాల్గింట మూడు వంతుల భూభాగం శాశ్వత ఐస్ పొరతో కప్పబడి ఉంటుంది. గణాంకాల ఆధారంగా ప్రపంచంలో అత్యల్ప జనసాంద్రత కలిగిన భూభాగంగా గుర్తించబడింది. ఇక్కడి జనసంఖ్య 57 వేల మంది మాత్రమే. గ్రీన్‌లాండ్‌లోని కొన్ని గ్రామాలలో వంద, రెండు వందలకు మించి జనాభా ఉండదు. వారి జీవనాధారం చేపలు పట్టడం. ఇక్కడ వ్యవసాయం చాలా తక్కువ. అందువల్ల ప్రపంచంలోనే మాంసాహార దేశంగా పేర్కొనబడింది. ఆర్కిటిక్ ఉమియాగ్ ఫెర్రీ సర్వీస్ పశ్చిమ గ్రీన్‌లాండ్‌లోని వివిధ నగరాలను, స్థావరాలను అనుసంధానిస్తుంది. 4,500 సంవత్సరాల పూర్వం నుండి గ్రీన్‌లాండ్ నివాసిత ప్రజల పూర్వీకులు ప్రస్తుత కెనడా నుండి ఇక్కడకు వలసగా వచ్చి స్థిరపడ్డారు.

1951లో ఫ్రెంచ్ శాస్త్రవేత్త పాల్-ఎమిలే విక్టర్ నేతృత్వంలోని ఒక సర్వే, మంచు పలక కింద గ్రీన్‌లాండ్ మూడు పెద్ద ద్వీపాలతో కూడి ఉందని నిర్ధారించింది. వైకింగ్‌ల తరువాత 1721లో గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్‌వాసులు ఆక్రమించుకున్నారు. 1979 వరకు ఇది వారి ఆధీనంలోనే ఉంది. అంటే 250 సంవత్సరాల తరువాత వీరు స్వతంత్ర ప్రతిపత్తిని పొందారు. ఆ తరువాత 27 మంది పార్లమెంటు సభ్యులు, ఆరుగురు మంత్రులు ఉన్న స్వతంత్ర దేశంగా మారింది.

గ్రీన్‌లాండ్ ఖండం కాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇది ఇతర ఖండాలు ఉమ్మడిగా ఉన్న ఏ ప్రమాణాలకు సరిపోదు. గ్రీన్‌లాండ్ దాని స్వంత టెక్టోనిక్ ప్లేట్‌లో లేదు. ఇది ఉత్తర అమెరికాతో కొంతమేర పంచుకుంటుంది. గ్రీన్‌లాండ్‌లోని స్వదేశీ ప్రజలు కెనడా, అలాస్కాలో నివసించే ఇన్యూట్‌లతో ఉమ్మడిగా అనేక ఆచారాలు, సంప్రదాయాలను కలిగి ఉన్నారు. అందువలన గ్రీన్‌లాండ్ ఒక ద్వీపం. ఇది ఉత్తర అమెరికాలో భాగం. ఇక్కడి ప్రజల బంధువర్గం అలాస్కా కెనడా, సైబీరియాకు చెందినవారు. గ్రీన్‌లాండ్ ఒక ఖండం కాదని వింటే చాలా మంది ఆశ్చర్యపోతున్నారు. అన్నింటికంటే ఇది 836,000 చదరపు మైళ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం. ఇది ప్రపంచంలోని అతి చిన్న ఖండం.

ఆస్ట్రేలియా లాగా సముద్రం మధ్యలో ఉన్న పెద్ద భూభాగం. పాశ్చాత్య నాగరికతా ప్రభావంతో ఇక్కడ ఆసుపత్రులు, పాఠశాలలు, ఆకాశవాణి నెలకొల్పారు. రెండు అమెరికా స్థావరాలు కూడా గ్రీన్‌లాండ్‌లో ఉన్నాయి. ఇక్కడ గడపడానికి వచ్చే పర్యాటకుల కోసం వసతి సౌకర్యాలు ఉన్నాయి. ఉత్తర ధృవానికి అతి చేరువలో ఉన్న గ్రీన్‌లాండ్ ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. సాహసోపేత పర్యటనకు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. దాదాపు వెయ్యేళ్ల క్రితం 400 కుటుంబాలు ఇక్కడికి వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. ఇప్పుడు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన గ్రీన్‌లాండ్ ఆర్కిటిక్ సముద్రానికి దక్షిణకొన చివర నెలకొని ఉంది. ఇక్కడ ఎక్కువ భూభాగం మూడు కి.మీ.



సాంద్రతగల మంచుతో కప్పబడి ఉంటుంది. ఇప్పుడు గ్రీన్‌లాండ్‌ను సెర్మెరసోఖ్, కుజాలేక్, క్వాసుసుట్సుప్, క్విక్తా మొదలైన పేర్లతో నాలుగు పురపాలక సంఘాలుగా విభజించారు. రాజధాని నూక్‌లో 2016లో ఆర్కిటిక్ వింటర్ గేమ్స్ నిర్వహించారు. 70 శాతం పునరుత్పాదక ఇంధన శక్తితో గ్రీన్‌లాండ్ ప్రపంచంలోనే అత్యధిక షేర్లలో ఒకటిగా ఉంది.

గ్రీన్‌లాండ్‌లో రైళ్లు ఉండవు. చాలా ప్రాంత ప్రజలు ఎక్కడికైనా వెళ్లాలంటే ఐస్ స్కేటింగ్, బోట్ల ద్వారా వెళతారు. కొన్ని ప్రాంతాలలో కార్లు ఉపయోగిస్తారు. ప్రపంచంలోనే అతి తక్కువ పెట్రోలు వాడే దేశంగా గ్రీన్‌లాండ్‌ను గుర్తించారు. శరీరంలో వేడి పుట్టేందుకు ఇక్కడి ప్రజలు మద్యం సేవిస్తుంటారు.

ఇప్పుడు ప్రపంచ వాతావరణంలో పెనుమార్పులు సంభవించడంతో మంచుతో నిండిన గ్రీన్‌లాండ్ ప్రజల్ని భయపెడుతుంది. ప్రపంచంలోని అతిపెద్ద ద్వీపం వాతావరణ మార్పులతో బాధపడుతోంది. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రపంచంలోని సముద్రతీర ప్రాంతాలను ఒకరోజు ముంచెత్తే ప్రమాదం ఉన్న ఒక భారీ ద్రవీభవన మంచుగడ్డగా మారింది. అతి శీతలంగా ఉండే గ్రీన్‌లాండ్‌లో వేడి పవనాలు వీచడం వల్ల ప్రజల్లో భయాందోళనలు అధికమయ్యాయి. ఈ వేడిగాలులకు ధృవ ప్రాంతాల్లోని మంచుఫలకాలు కరిగిపోతున్నాయి. ఫలితంగా సముద్రంలోకి నీరు అధికంగా చేరుతుంది. గ్రీన్‌లాండ్‌లో మంచు వేగంగా కరుగుతుందని పర్యావేరణవేత్తలు చెప్పడం మరింత ఆందోళనను కలిగిస్తోంది. 1950 నుండి ఈ ప్రాంతంలో మంచు కరుగుతోందని గుర్తించారు. ఇప్పటివరకు దాదాపు మూడు సార్లు ఇక్కడి మంచు కరిగినట్లు పరిశోధనల్లో తేలింది. గ్రీన్‌లాండ్‌లోని మంచు మొత్తం కరిగితే ప్రపంచంలోని సముద్రాల నీటి మట్టం 6 నుండి 7 మీటర్ల వరకు పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అందువల్ల వాతావరణంలో వేడి పెరగకుండా చూడవలసిన బాధ్యత ప్రపంచ ప్రజలందరిపై ఉంది. ప్రతి దేశంలో విధిగా అత్యధికంగా చెట్లను పెంచాలి. కలుషిత వాయువులు ఉత్పత్తి కాకుండా సాధ్యమైనంత మేర ప్రయత్నించాలి. లేకుంటే ఈ భూ ప్రపంచంలోని మానవాళికి సముద్ర జలాల ముప్పు తప్పదు. గ్రీన్‌లాండ్‌లో ఖనిజాలు, స్వచ్ఛమైన నీరు, మంచు, చేపల నిల్వలు, సముద్రపు ఆహారం, పునరుత్పాదక శక్తి వంటి విలువైన వనరులతో సమృద్ధిగా ఉన్నాయి. మూడు కి.మీ. మేర మంచు పలకలతో కప్పిన గ్రీన్‌లాండ్ ప్రపంచంలోని 10 శాతం మంచినీటిని కలిగివుంది.

## ఆండీస్ పర్వతాలు

ఆండీస్ ప్రపంచంలోనే అతి పొడవైన పర్వత శ్రేణి. ఆండీస్ పర్వతాలు చాలా ఎత్తైన పీఠభూముల శ్రేణి. ఇది దాదాపు 8.900 కి.మీ. పొడవున వ్యాపించి వున్నాయి. అర్జెంటీనాలోని అకాన్‌కాగువా పర్వతం ఆండిస్ పర్వత శ్రేణిలో ఎత్తైన ప్రదేశం. ఇది దక్షిణ ఆండీస్ పర్వతాలలో ఉంది. దీని శిఖరం అర్జెంటీనాలో ఉన్నప్పటికీ, దాని పశ్చిమ పార్శ్వాలు శాంటియాగోకు ఉత్తరాన ఉన్న చిలీ తీర లోతట్టు ప్రాంతాల నుండి నిర్మించబడ్డాయి. ప్రపంచంలోనే ఎత్తైన అగ్నిపర్వతాలు ఇక్కడ ఉన్నాయి. ఆండీస్ సముద్ర మట్టానికి 6,962 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ పర్వతాలు



కొన్ని మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి. దక్షిణ అమెరికా దక్షిణ కొన నుండి కరేబియన్‌లోని ఉత్తర తీరం వరకు వ్యాపించి ఉన్నాయి. దక్షిణ అమెరికాలోని ఆండీస్ ప్రపంచంలోనే అతి పొడవైన పర్వత శ్రేణులు. అయితే ఈ పర్వతాలకు ఆ పేరు ఎలా వచ్చిందనే దాని వెనక భిన్న వాదనలు ఉన్నాయి. స్థానిక క్యుచువా భాషలో ఆండీ అంటే 'కొండల పైన చేసే సాగు' అని అర్థం. ఆండీస్ పర్వత శ్రేణులు ప్రధానంగా రెండు మహాశ్రేణులైన కార్డిల్లెరా ఒరియంటల్‌ల సమాహారం. ఇతర పర్వత పంక్తులు ఆండీస్ పర్వత ప్రధాన స్రవంతిలో కలుస్తున్నాయి. ఆండీస్ పర్వతాలు అర్జెంటీనా, బొలీవియా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్, పెరూ, వెనిజులా ఇత్యాది ఏడు దేశాలలో వ్యాపించి ఉన్నాయి. వీటిలో కొన్ని దేశాలను ఆండియన్ దేశాలు అని కూడా వ్యవహరిస్తారు.

## విట్నీ పర్వతాలు

మౌంటి విట్నీ అలాస్కా రాష్ట్రంలో తప్ప అమెరికా, సియెర్రా నెవాడాలో ఎత్తయిన పర్వతం. దీని ఎత్తు 4,421 మీటర్లు. కాలిఫోర్నియాలోని ఇన్యో-తులరే కౌంటిల మధ్య సరిహద్దులో ఇది నెలకొని ఉంది. విట్నీ పర్వతం మోహావే ఎడారిలో ఉత్తరాన ఉంది. ఈ శిఖరం ఎత్తు ఏడాదికి ఒక రకంగా పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో 4,418 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఈ పర్వతాన్ని అధిరోహించడానికి పర్యాటకులు ఆహ్లాదంగా ఇష్టపడతారు. దాదాపు 35 కి.మీ. దూరం నడిస్తే శిఖరాన్ని చేరుకోవచ్చు. అక్కడక్కడా బస చేయడానికి వసతి సౌకర్యాలు కూడా ఉంటాయి. దారి పొడవునా ప్రమాదకరమైన ఎలుగుబంట్లు కనిపిస్తాయి. ముఖ్యంగా అందరూ సమూహాలుగానే వెళుతుంటారు. రాత్రి సమయాలలో టార్చ్‌లైట్లు వంటి సాధనాలను కూడా తీసుకుని వెళతారు. విట్నీ పర్వతాన్ని అధిరోహించాలంటే అనేక ఎత్తుపల్లాలు ఉంటాయి. ఇది చాలా శ్రమతో కూడుకున్న విషయం. అయితే పశ్చిమంగా దీన్ని అధిరోహించడం కొంత సులువుగా ఉంటుంది. ఆ కారణంగా పర్యాటకులు పశ్చిమం నుండి ఈ పర్వతాన్ని అధిరోహిస్తారు. విట్నీ శిఖరాన్ని అధిరోహించడానికి మూడు నుండి నాలుగు రోజుల సమయం పడుతుంది.

ఎండా కాలంలో కొంత వేడిగా వున్నప్పటికీ రాత్రివేళలో వాతావరణం కొంత చల్లగానే ఉంటుంది. చలికాలంలో శిఖరాన్ని అధిరోహించడం కొంత కష్టంగా ఉంటుంది. దారి పొడవునా పెద్ద పెద్ద మంచుదిబ్బలు, మంచు గుట్టలు ఉంటాయి. సాహస అధిరోహకులు వాటిని తొలగించే సాధనాలు తీసుకుని వెళ్లి, దారికి అడ్డుగా ఉన్నవాటిని తొలగించి శిఖరాన్ని చేరుకుంటుంటారు. జులై నెలలో మంచు అంతగా ఉండదు. అప్పుడు ప్రయాణం ప్రశాంతంగా జరగడం వల్ల ఎక్కువ మంది పర్యాటకులు విట్నీ పర్వతాన్ని అధిరోహిస్తుంటారు.

చిన్న కథలు

# వర్మ నస

వర్మ అంటే అందరికి చులకనే! అతని వయసు ఏడు పదులు దాటుతున్నది. అయినా విశ్రాంతిగా యింట్లో కూర్చోడు. లేనివాడు కాదు, బాగా ఆస్తిపరుడు. పిల్లలు కూడా బాగా సెటిలయ్యారు. బాధ్యతలు అన్నీ తీరిపోయాయి. అతను బీమా ఏజెంటుగా చాలా కష్టపడుతుంటాడు. కనిపించిన ప్రతి ఒక్కరిని పాలసీ అడుగుతాడు. కొందరు యిస్తారు, కొందరు యివ్వరు. అలాగే తనకు పాలసీలు యిచ్చిన వారిని మర్చిపోకుండా అప్పుడప్పుడు పలకరిస్తూ ఉంటాడు. ఏవైనా పనులు పడితే చేస్తూ ఉంటాడు. ఆరోజు పొద్దున్నే శర్మ యింటికి వచ్చాడు వర్మ.

"అయ్యా! శర్మగారు నేను రెండు సంవత్సరాలుగా మిమ్మల్ని పాలసీ అడుగుతున్నాను. అయినా మీరు పాలసీ తీసుకోవడం లేదు. కనీసం ఇప్పుడన్నా తీసుకోండి" వర్మ బతిమాలుతూ చెప్పాడు.

"నా బాధలు నీకెలా తెలుస్తాయి. నా జీతం నాకే చాలడం లేదు. మళ్లీ పాలసీ తీసుకుని ప్రీమియములు ఎక్కడ కట్టేది?" విసుక్కున్నాడు శర్మ.

శర్మ భార్య సత్యవతి వచ్చింది కాఫీకప్పులతో. ఆమె మనసు చివుక్కుమంది పెద్దాయనను



అలా కసురుకోవడంతో. "పాపం! పెద్దాయన రెండు సంవత్సరాలుగా వెంట బడుతున్నాడుగా, ఒక పాలసీ చెయ్యొచ్చుగా" భర్తతో చెప్పింది.

"నువ్వు చూస్తున్నావు కదుటే నా జీతం మిగలడం లేదు" శర్మ అన్నాడు.

"సత్యమ్మా! ఈ వయసులో దాచుకోకపోతే యింకెప్పుడు దాస్తాడు? ఎంత జీతం వచ్చినా సరిపోదు, ఏదో ఖర్చు వస్తూంటుంది. అలానే పాలసీ కూడా కట్టాలి" "నేను కొన్ని ఖర్చులు తగ్గిస్తాలెండి. మీరు ఆయనకి ఒక పాలసీ కట్టండి" హుకుం జారీ చేసింది సత్యవతి.

వియోగి

శర్మ ఏడ్చుకుంటూ అయిష్టంగా పాలసీ తీసుకున్నాడు. "మొదటి కంతు మీరు కట్టండి. ఆరు నెలల తరువాత నేను కడతాను" అన్నాడు.

వర్మ అతనికి నచ్చచెప్పబోయినా వినలేదు.

"సరేలే" అని పెద్దాయన అంగీకరించాడు. సంతకాలు పెట్టించుకుని వెళ్లిపోయాడు.

"హూ.. అడుక్కుతినే వెధవ! పొద్దున్నే తగలడ్డాడు.. ఈ వయసులో యింట్లో కూర్చోకుండా అందరి ప్రాణాలు తింటున్నాడు" అని కసితీరా తిట్టాడు ఆయన బయటకు పోగానే అతనికి వినిపించేట్లు.

మూడు నెలలు అయింది పాలసీ వచ్చి. ఒకరోజు స్కూటరు యాక్సిడెంటు అయి శర్మ పరలోకం చేరుకున్నాడు సత్యవతిని అనాథని చేసి.

నెల తర్వాత వర్మ పది లక్షల సొమ్ము బీమా సంస్థ నుండి సత్యవతికి యిప్పించి ఆమె వీధిన పడకుండా ఆదుకున్నాడు.

ఆమె ఆయన చేతులు పట్టుకుని క్షమాపణలు అడిగింది తన భర్త తిట్టినందుకు. ■

# పరపతి

ప్రమోషన్ల సీజను వచ్చింది. సూర్యం పేరు లిస్టులో ఉంది. సీనియారిటీ ఉంది కాబట్టి కచ్చితంగా అవుతాడు సూపరింటెండెంటు. అతను సీనియరు అసిస్టెంటు నుండి సూపరింటెండెంటు కావలసి ఉంది. అది కాదు సమస్య.. ఈసారి ప్రమోషన్ వచ్చినవారందరినీ సిటీ నుంచి దూరంగా వేస్తున్నారట. సూర్యం పాతిక సంవత్సరాలుగా సిటీలో ఉంటున్నాడు. హెడ్డాఫీసు కనుక ట్రాన్స్‌ఫరు రాకుండా మేనేజ్ చేసుకుంటున్నాడు. పిల్లలు చదువుకుంటున్నారు. భార్య కూడా ఉద్యోగస్తురాలు, ఆమె ఇతని మీద ఎక్కువ ఆధారపడుతుంది.

అటు యింటి పనులు చేసుకుని, భార్యను ఆఫీసుకు దింపాలి. పిల్లల్ని ఉదయమే స్కూళ్లకు పంపాలి, లంచ్ బాక్సులు యిచ్చి. వారిది లేటు మ్యారేజ్ కావడంతో పిల్లలు యింకా మరీ పెద్దవారు కాలేదు. హైస్కూలు చదువులు చదువుతున్నారు. అలాంటిది బయటకు ట్రాన్స్‌ఫర్ అయితే సంసారం అల్లకల్లోలమయిపోతుంది. పిల్లల్ని ఆ ఊరికి తీసుకుపోలేడు. భార్యకు అంత ఈజీగా ట్రాన్స్‌ఫర్ రాదు. ఆమెకొచ్చేలోగా తను యింకో ఊరికి బదిలీ కావచ్చు. ఏం చెయ్యాలో పాలుపోక సూర్యం తన స్వగ్రామంలోని తన అన్నయ్య భాస్కర్‌ని సహాయం అడిగాడు ఎవరైనా మినిస్టరుని పట్టుకుని సిటీలో పోస్టింగు యిప్పించమని.

భాస్కర్ వారిని కదిలించి చూశాడు పియ్యేల ద్వారా. పోస్టింగుకు లక్షల్లో అడుగుతున్నారు. సూర్యం ఆఫీసులో అంత ఎక్కువగా లంచాలు రావు, అంత పెట్టలేడు.

దిక్కుతోచక తన గురువు గారికి తన సమస్య చెప్పాడు భాస్కర్. తన తమ్ముడు సూర్యంకు చాలా ఆపద రాబోతున్నదని, ప్రమోషన్‌కాదుగానీ అది పెద్ద పనిష్‌మెంటుగా మారబోతున్నదని విన్నవించాడు.

గురువుగారు అంతా విని తలాడించాడు "భగవంతుడి దయ" అన్నారు.

కానీ ఆశ్చర్యంగా వారం తరువాత సూర్యంకు ప్రమోషన్ మీద పోస్టింగు కూడా సిటీలోనే అదే ఆఫీసులో వేసారు. అతనితో పాటు ప్రమోషన్ పొందినవాళ్లు చాలా దూరంగా జిల్లాలకు వేయబడ్డారు. ఎవరినీ సిటీలో ఉంచలేదు. బయటకు పోతే మళ్లీ సిటీకి రావాలంటే అయిదేళ్లు పడుతుంది. సూర్యం భాస్కర్‌కు ఫోను చేసి థాంక్స్ చెప్పాడు తన పోస్టింగు గురించి చెప్పి.

భాస్కర్ ఇదంతా గురువుగారి చలవ అని తెలుసుకుని స్వీట్‌బాక్స్ తీసుకుని వెళ్లి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

"గురువుగారూ! మీరు ఏం మాయ చేశారోగానీ మా తమ్ముడు హ్యాపీగా సిటీలో వున్నాడు"

గురువుగారు చిరునవ్వు నవ్వి చెప్పారు "నాదేముంది? పెద్ద హోదాలో వున్న ఒక అధికారి మీ తమ్ముడికి పైసా తీసుకోకుండా సాయం చేశాడు. ఎందుకంటే అతను నా శిష్యుడు కాబట్టి".

భాస్కర్‌కు అతని పరపతి అర్థమయింది. ■

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



అనుకూలమైన ఫలితాలు గోచరిస్తున్నాయి. కోర్టుతీర్పులు లాభిస్తాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా పరపతి పెరుగుతుంది. ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడతారు. శుభ కార్యాలను విజయవంతంగా పూర్తి చేయడానికి కొంత శ్రమించవలసి వస్తుంది. మీపై పుకార్లు, అపనిందలు ప్రచారంలో ఉంటాయి. వివాదాస్పద అంశాలను అనుకూలంగా మలచుకుంటారు.

## వృషభం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. శుభకార్యాలు సానుకూల పడతాయి. ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి. లిఖితపూర్వక వ్యవహారాలు లాభసాటిగా సాగుతాయి. సంతానం పైన దృష్టి కేంద్రీకరించవలసి ఉంటుంది. శత్రువర్గంలో అప్రమత్తంగా మెలగవలసి ఉంటుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా చికాకులు చోటు చేసుకోవచ్చు.

## మిథునం



చాలావరకు అనుకూల ఫలితాలు అందుకుంటారు. పెండింగ్‌లో వున్న వ్యవహారాలు సానుకూల పడతాయి. గణిత ప్రాధాన్యం కలిగిన రంగాలలోని వారికి లబ్ధి చేకూరుతుంది. మీపై వచ్చే విమర్శలు పుకార్లేనని తేలిపోతుంది. చిట్టి పొట్టి అవాంతరాలు ఏర్పడినా అవలీలగా అధిగమించగలుగుతారు. ముద్రణా, ప్రచురణా రంగాలలోని వారికి లబ్ధి చేకూరుతుంది.

## కర్కాటకం



వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలంగా ఉంటుంది. వ్యాపారస్తులు జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది. మధ్యవర్తిత్వాలు, రాయబారాలు, పంచాయితీలు తలనొప్పిగా పరిణమిస్తాయి. ఏదో ఒక కార్యక్రమం ద్వారా శత్రువర్గానికి హెచ్చరికలు జారీ చేస్తారు. ఆర్థిక లావాదేవీలలో కఠినమైన నిర్ణయాలు తీసుకుంటారు. మీ నిర్ణయాలకు కార్యరూపం ఇస్తారు.

## సింహం



మీ ధోరణిలో కొంత మార్పు కనబడుతుంది. ఆర్థిక వ్యవహారాల పైనే దృష్టి కేంద్రీకరిస్తారు. ధనమే అన్నింటికీ మూలమనే భావన కలిగి ఉంటారు. వృత్తి, ఉద్యోగాల పరంగా అధికంగా శ్రమిస్తారు. అధికారుల మెప్పు సాధిస్తారు. గృహంలో పొడచూపుతున్న విభేదాలను ఆదిలోనే పరిష్కరించుకోవడం ఎంతైనా అవసరం. రాయబారాలు లాభిస్తాయి.

## కన్య



హడావుడిగా కాలం గడుపుతారు. వృత్తి, ఉద్యోగాల పరంగా శ్రమ అధికం అవుతుంది. ఉపయుక్తం లేని బాధ్యతలను తలకెత్తుకోవలసి వస్తుంది. ఆర్థికంగా లబ్ధిని పొందుతారు. గౌరవ మర్యాదలను కలిగి వుంటారు. నిత్యం ఆరావళి కుంకుమతో శ్రీ మహాలక్ష్మీదేవిని పూజించడం చెప్పదగింది. ఓ మిత్రునికి మీ సహకారం లభిస్తుంది.

## తుల



ప్రభుత్వ సంబంధమైన పనులు సానుకూల పడతాయి. లిఖిత పూర్వత వ్యవహారాల వల్ల లాభపడతారు. వ్యక్తిగత హోదా, స్థాయి పెంపొందుతాయి. దుబారా ఖర్చులు చోటు చేసుకుంటాయి. ఒక సమస్య తీరితే మరో సమస్యను పరిష్కరించుకోవలసి వస్తుంది. విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేస్తారు. రిజిస్ట్రేషన్ పనులు సానుకూల పడతాయి. ఆధ్యాత్మిక దీక్షలను స్వీకరిస్తారు.

## వృశ్చికం



సానుకూల ఫలితాలు గోచరిస్తున్నాయి. తగాదాలు, వివాదాలు చోటు చేసుకున్నప్పటికీ అవి లాభించేవిగా ఉంటాయి. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. ఓ కొత్త ఆదాయ మార్గాన్ని అన్వేషించడంలో సఫలతను సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు సానుకూలపడుతుంది. సకాలంలో అవకాశాలను వినియోగించుకోవడానికి అవసరమైన బలం, బలగం కలిగి వుంటారు. శత్రువర్గం మీ గౌరవ మర్యాదలకు ఇబ్బంది కలిగించవచ్చు.

## ధనుస్సు



శుభకార్యాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. బ్యాంక్ రుణాలు మంజూరవుతాయి. మీరంటే గిట్టనివారు కొన్ని చికాకులు, తంటాలు తెచ్చిపెట్టినప్పటికీ వాటిని అధిగమిస్తారు. వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలంగా ఉంటుంది. భార్య తరపు బంధువుల సహకారం లభిస్తుంది. మొండివారిని ఒప్పించి కార్యోన్ముఖులను చేస్తారు. నిత్యం సర్వరక్షా చూర్ణంతో స్నానమాచరించండి.

## మకరం



ప్రయోజనాలను పొందగలుగుతారుగానీ వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల పరంగా అధికంగా శ్రమించవలసి ఉంటుంది. రుణాలు తీసుకోవడం, రుణాలు ఇవ్వడం రెండూ కలిసి రావు. వీసా, పాస్‌పోర్ట్ వంటి అంశాలు సానుకూల పడతాయి. మీరు ఎంతగానో నమ్మి ఎవరికైతే రహస్యాలు చెబుతారో వారే మీ వ్యక్తిగత హస్యాలను బహిర్గతం చేస్తారు. ఆదాయాన్ని మించిన ఖర్చులు ఉంటాయి. ప్రజా సంబంధాలు మెరుగు పడతాయి.

## కుంభం



రాజకీయ రంగంలోని వారికి అనుకూలమైన మార్పులు గోచరిస్తున్నాయి. రహస్య వ్యూహాలను అవలంబించి లాభపడతారు. వృత్తిలో కొన్ని మార్పులు చేస్తారు. కొత్త పెట్టుబడులు చోటు చేసుకుంటాయి. చాపకింద నీరులా వివాదాలకు పోకుండా పనులను సానుకూలపరచుకుంటారు. ఆలోచనల్లో స్పష్టత లోపిస్తుంది. విలువైన వస్తువులు కొనుగోలు.

## మీనం



మీ సలహాలను, సూచనలను ఉన్నత స్థాయి వర్గం వారు కూడా పాటిస్తారు. సహోదరీ వర్గంతో ఏర్పడిన విభేదాలు సమసిపోయే సూచనలున్నాయి. ఆదాయ, వ్యయాలలో సమతుల్యత లోపించకుండా జాగ్రత్తలు వహించడం చెప్పదగింది. స్త్రీలతో విభేదాలు వచ్చే సూచనలున్నాయి. మీ నిర్ణయాలు సరైనవే అయినప్పటికీ ఇతరుల మాటలు మీలో మార్పులు తీసుకొస్తుంది. వ్యాపార పరంగా లబ్ధి చేస్తూర్చే ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458



# రైస్‌మిల్లు కొనవచ్చా?

**ఎస్.మణికంఠ – ఒంగోలు**

**ప్రశ్న:** మా ఊళ్లో రైస్‌మిల్లు అమ్మకానికి ఉన్నది. తూర్పు సింహద్వారం. ఆ రైసుమిల్లుకు నాలుగు పక్కల వసారాలు వేసారు. పడమర అంటే మిల్లు వెనుక భాగం ప్రహరీ గోడలపై వసారా వేసి గదిలా మూసారు. అన్నిటికంటే ముఖ్యమైనది మిల్లుకు పడమరలో చాలా పెద్ద చెరువు వుంది. చెరువుకు-ఇల్లుకు మధ్య ప్రహరీగోడ ఉంది.ఆ మిల్లు యజమాని ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇల్లు అమ్ముతున్నాడు.

కనుక మీ సలహా మేరకు ఏ విధంగా చేయాలో తెలియచేస్తే నేను, నా స్నేహితుడు కలిసి మిల్లు కొంటాం. మిల్లుకు దక్షిణ భాగంలో 25 అడుగులు, ఉత్తరంలో 36 అడుగులు, పడమరలో 40 అడుగులు, తూర్పున 14 అడుగుల ఖాళీ స్థలం ఉంది.

**జవాబు:** పశ్చిమ ప్రహరీ గోడనానుకుని ఆ మిల్లుకు పశ్చిమాన పెద్ద చెరువు వున్నందువల్ల ఆ మిల్లును కొనుక్కోమని నేను సలహా ఇవ్వలేను. ఆ రైస్‌మిల్లు ఆవరణలో వున్న వాస్తు మాత్రమే గాక దాని చుట్టుపక్కల వున్నవాటిని బట్టి కూడా వాస్తు పరిణామాలు వుంటాయి.

## వాస్తు దోషాలున్నాయా?

**జి.కాంతారావు – హైదరాబాద్**

**ప్రశ్న:** చాలా రోజులు శుభ ముహూర్తాలు లేవని మేం.. ఇంటి పనులు పూర్తి కాకుండానే ఒక మంచిరోజు చూసి ఇంట్లో చేరి, వేరేగా అద్దెఇంట్లో వున్నాం. తరువాత మా అబ్బాయికి రెండు సం॥కు మా కొత్త ఇంటి ముందు ఓ ప్రమాదంలో కాలు విరిగింది. ఆపరేషన్ తరువాత బాగానే నడుస్తున్నాడు. ఇంటిపని పూర్తయిన తరువాత గృహప్రవేశం చేసాం. ఆ తరువాత ఒక సంవత్సరానికి మా నాన్నగారు మరణించారు. మా ఇంటి ప్లానులో దోషమున్నట్లుగా చెపుతున్నారు మా పరిచయస్తులు.

**జవాబు:** పెరిగిన దక్షిణ ఆగ్నేయాన్ని సవరించండి. తూర్పున కాంపౌండు గోడ, ఈశాన్య, ఆగ్నేయం నుండి ముందుకు చొచ్చుకువచ్చి తూర్పున రెండు భుజాలున్న ప్రభావాన్ని చూపిస్తూ తూర్పు ఈశాన్యం, తూర్పు, ఆగ్నేయాలను పెంచివేస్తుంది. అలాగే మీ ఇంటి స్థలానికి ఐదు భుజాలు తయారయ్యాయి. కనుక తూర్పు కాంపౌండు గోడను నేరుగాగానీ, తూర్పు ఈశాన్యాన్ని మాత్రమే పెంచుతూగానీ సవరించండి. తూర్పు గోడను ఆనుకుని వున్న లెట్రిన్‌ని, ఈశాన్య గోడనానుకుని వున్న బెడ్ రూమ్‌ని కూడా పూర్తిగా తీసేసి పశ్చిమ గోడకు దగ్గరగా ఉత్తర గోడకు తగలకుండా కొంత స్థలాన్ని వదిలి కట్టుకోవాలి. ఉత్తర వాయవ్యం నుండి దక్షిణ నైరుతిగా నడక సాగేలా ద్వారాలన్నీ నీచ స్థానంలో వున్నాయి. వాటిని ఉచ్ఛస్థానాలకు మార్చుకోవడం వలన నడక ఉత్తర ఈశాన్యం నుండి దక్షిణ ఆగ్నేయానికి సాగి చాలా మంచి ఫలితాలు కనిపిస్తాయి. ■

## బరువులు పెట్టకూడని స్థలాల్లో బరువులు పెట్టాల్సి వస్తే?

మనం ఉండే ఇల్లు వాస్తు ప్రకారం సామాన్లను అమర్చుకోవడానికి వీలు లేనిదై వుండవచ్చు. కావల్సిన మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవసరమయిన ఆర్థిక పరిస్థితి లేకపోవచ్చు. అటువంటప్పుడు తక్కువ శ్రమతో, అల్ప వ్యయంతో మనం చేయదగిన పనుల్లో ఒకటి సామాన్లను శాస్త్రానికి అనుగుణంగా మార్చి పెట్టుకోవడం.

'మన ధర్మం మనం నిర్వర్తిస్తే ఇంటి ధర్మం ఇల్లే నిర్వర్తిస్తుంది' అనటంలో సందేహం లేదు. ఇంటి గదిలో పశ్చిమ, దక్షిణ గోడలకు ఆనిస్తూ ఎలాంటి బరువులయినా పెట్టవచ్చు. అందువలన మంచి ఫలితాలు ఉంటాయి. కానీ ఉత్తర, తూర్పు దిక్కున్న గోడల వైపు ఏ బరువులు పెట్టకూడదు. తద్వారా మంచి ఫలితాలు కలగకపోవటం మాట అటుంచి చెడు ఫలితాలు కనిపిస్తాయి. అన్ని దిక్కుల కంటే కూడా నైరుతి మూలలో ఎంత బరువు వేస్తే అంత మంచిది. ఈశాన్య, ఆగ్నేయాల్లో అసలు బరువు వుండకూడదు. ఇక్కడ బరువులు వేయవలసి వస్తే ఏం చేయాలన్న ప్రశ్నకు సమాధానం 'వేయకూడదు'. అంతే. దానికి తిరుగులేదు. దూదిపింజ బరువు కూడా ఈ స్థలాల్లో వుండకూడదు. దక్షిణ ఆగ్నేయమూల మాత్రం కొంత తెరిపి యిచ్చి వాడుకోవచ్చు.

అయితే తూర్పుకుగానీ, ఉత్తరానికి గానీ బరువులు వేయకూడదన్న నియమం వున్నా అక్కడ బరువులు వేయవలసి వస్తే అందుకు చిన్న ప్రత్యామ్నాయం వుంది... తూర్పున బరువైన వస్తువులు పెట్టవలసి వస్తే తూర్పుగోడకు తగలకుండా పెట్టాలి. ఆ వస్తువులకు, తూర్పుగోడకు మధ్య కనీసం కొన్ని అంగుళాల ఖాళీ స్థలమయినా వదిలిపెడితే చాలు.

ఉత్తరాన బరువున్న వస్తువులను అమర్చవలసి వస్తే తూర్పు గోడను తాగకుండా అమర్చాలి. ఆ వస్తువులకు, ఉత్తరపు గోడకూ మధ్య కనీసం కొన్ని అంగుళాల ఖాళీ స్థలమయినా వుండేట్టు జాగ్రత్త పడాలి.


వాయవ్యంలో పడమటి వాయవ్య భాగంలో పడమటి గోడను అంటుకుని బరువులు అమర్చవచ్చు. కానీ ఉత్తరపు గోడను అంటుకునే విధంగా అమర్చకూడదు.

ఆగ్నేయంలో వస్తువులను పెట్టకూడదన్న నియమం పొయ్యికి వర్తించదు. పొయ్యిని కాస్త ఎత్తులో మూడు రాళ్లతోగానీ, మట్టితోగానీ నిర్మించుకుంటే దోషం లేదు. గ్యాస్ స్టౌలు, ఎలక్ట్రిక్ స్టౌలు, నిప్పుల పొయ్యి (బొగ్గుల పొయ్యి) మొ॥ నేల మీద కాకుండా ఏదయినా చిన్న స్టాండు మీద అమర్చుకుంటే మంచి ఫలితాలు ఇనుమడిస్తాయి.

గోబర్ గ్యాస్ పొయ్యిలు సహజంగానే నేలకు కాస్త ఎత్తులో వుంటాయి. అలా లేని పక్షంలో కాస్త ఎత్తులో వుండేలా నిర్మించుకోవాలి. ఇంట్లో సామాన్లను శాస్త్రానుకూలంగా అమర్చుకోవాలనుకునే వారికి దిశల గురించి, వాటి అధిపతుల గురించి, హద్దుల గురించి, మంచి-చెడు ఫలితాల గురించి అనేక సందేహాలు రావటం సర్వసాధారణమయిన విషయం. ■

# పదరంగం-20

కూర్పు: పోపూరి విశ్వనాథ్




## ఆధారాలు

### అడ్డం

1. తెలుగులో 'టైంపాస్' (4)
3. జానిసగా చేయు సేవ (5)
5. చాడీలు (3)
6. గురువు కాదు (3)
8. ఇకయికల తోటిది (5)
11. జరీ సరిగా లేదు (4)
13. తెలంగాణా రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి (3)
15. సంవత్సరం చెదరిపోయింది (3)
17. సంధి లాంటి ఒప్పందం (2)
18. కడుపులో ఉండేది 2)
19. ప్రవర్తన (4)
21. వాడుక భాషలో మద్యం తాగే అలవాటు (3)
23. సేవ, ఉపచారం (4)
25. చప్పుడు (4)

### నిలువు

1. .... గంధర్వులే తీరుస్తారని సామెత (5)
2. మొండి పట్టుదల (2)
3. బయట (4)
4. అలుక, కోపం (3)
7. మొత్తం ఆపకుండా (పైకి) చదువుట/చెప్పుట (4)
9. ప్రాయం, యౌవనం (3)
10. 'పైకి' ఏగిన గానగంధర్వుడు (2)
12. చెట్టుపై పట్ట, బెరడు (2)
13. రెంటికి చెడ్డ .... అని సామెత (3)
14. పైకొచ్చిన ఒక రాష్ట్రం (4)
15. మచ్చ (2)
16. రోజువారీ పని (4)
18. అర్థంలేని వాగుడు (4)
20. వేసవి కాలపు అతివేడిగాలి (4)
21. స్పర్శ, వత్తిడి (3)
22. తలకిందులైన పెనిమిటి (3)
24. శీతం (2)

## పదరంగం-18 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| స1 | సే | మి2 | రా | | దుం3 | | అం4 | | మం5 |
| మా | | డి | | ఆ6 | ప | ద్బాం | ధ | వు | డు |
| వే7 | డి | మి | | స్టక్రే | | | కా | | తు |
| శం | | డి8 | కి | లి | అ | | రం9 | కా10 | శ్రీ |
| | తి11 | జ్ఞా | | యా | | ప12 | | ప | |
| క13 | | నం14 | జు15 | | | ది16 | వా | లా | |
| రా17 | వి18 | | లా19 | లా | జ20 | లం | | | వ్యా21 |
| | ప22 | రా | యి | | లై | | | వి23 | ధి |
| | రీ | | | అం24 | డ | దం25 | డ | లు | |
| వి26 | తం | డ | వా | దం | | చ | | వ27 | ల |

### పదరంగం-18కి జవాబులు పంపించినవారు


1. వెలివెల శ్రీరామారావు-పెనమలూరు; 2. వుమ్నా రంగారెడ్డి-కూకట్‌పల్లి; 3. యం.వి.రమణకుమారి-హైదరాబాద్
4. గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు-రాజంపేట


జవాబులు పంపించాల్సిన చిరునామా:
**పదరంగం** ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ..............................................
..............................................
ఊరు : ..............................................

# ఈ వారం కా‘ర్టూన్స్’


ప్రసూతి.
అబ్బాయా?! ఇకనుండి బస్సు చార్జీలు బొక్కన్నమాట!!


అన్నీ ఊడ్చేసి వెళ్తున్నావా?
... కక్కేస్తా జాగ్రత్త!
2023
2024


ప్రతి పక్షం ఉంటే ఎలా ఉంటుంది.. లేకుంటే ఎలా ఉంటుంది.. ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోంది!



స్కాట్లాండ్‌లోని క్రొవి అనే ఈ కుగ్రామం ఒకప్పుడు ఫిషింగ్ గ్రామం. ప్రజలతో కళకళలాడుతూ వుండే ఈ ఊరు పెద్ద తుపాను తాకిడికి మునిగిపోయింది. సముద్రపు ఒడ్డున ఒకే వరుసలో ఉండే పొదరిళ్లు, ఎత్తయిన కొండలు ఈ ఊరి ప్రత్యేకత. ఇక్కడ జనాలెవరూ లేకపోయినా వచ్చీ, పోయే సందర్శకులతో పర్యాటక ప్రాంతంగా మారిందీ ఊరు.











